ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య


జిల్లా వార్తలు

5

బుధవారం 12 మార్చి 2025

# చంద్రన్న బీమాకు గ్రహణం

- 2014లో అమలులోకి వచ్చిన పథకం
- జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక.. ఏడు నెలలు ప్రీమియం చెల్లించని వైనం
- ఇన్సూరెన్స్ రాక బాధితుల గగ్గోలు
- చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఉమ్మడి కడప జిల్లాలో మూడు వేల మంది బాధితులు






ఇస్త్రీ చేస్తున్న బాధితురాలు నాగేశ్వరి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి నోరు తెరిస్తే చాలు.. తాను అనుక్షణం పేదల సంక్షేమం కోసం ఆలోచిస్తానని ఊదరగొట్టేవాడు. తన చేతికి ఎముకే లేదని, అడిగిన వాళ్లకు.. అడగని వాళ్లకు సైతం ఎంతో ఉదారంగా సాయం చేస్తానని గొప్పలు చెప్పేవాడు. అయితే వాస్తవంలో పరిస్థితి మరోలా ఉంది. చంద్రబాబునాయుడు పాలనలో తెచ్చిన చంద్రన్న బీమా పథకానికి జగన్‌రెడ్డి తూట్లు పొడిచాడు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. 31 మార్చి 2020 వరకు ఈ పథకం నిరాటంకంగా అమలు జరిగింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2020 ఏప్రిల్ 1 నుంచి ఈ పథకాన్ని పునరుద్ధరణ చేయలేదు. ఆ తర్వాత నెమ్మదిగా వైఎస్సార్ బీమా పథకాన్ని తెచ్చాడు. ఈ పథకం అమలులోకి వచ్చినప్పటికీ.. చంద్రన్న బీమా గడువు తీరిపోయిన ఏడు నెలల కాలంలో చనిపోయిన వాళ్లెవరికీ బీమా చెల్లించలేదు. ఆ కాలానికి తాను బీమా చెల్లించనని జగన్ ఖరాఖండిగా చెప్పేశాడు.

### మూడు వేల మందికి అన్యాయం

ఉమ్మడి కడప జిల్లాలో చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరణ చేయని ఆ ఏడు నెలల కాలంలో సుమారు మూడు వేల మంది వివిధ కారణాలతో చనిపోయారు. ఏవో సాకులు పెట్టి వారికి బీమా పరిహారం ఇవ్వలేదు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం మృతుల కుటుంబ సభ్యులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగీ అలసిపోయారు. అయినా ఫలితం లేదు. వేలాది మంది లబ్ధిదారులు బీమా సొమ్ము కోసం ఎదురు చేస్తున్నారు.

### కూటమి ప్రభుత్వమూ చేతులెత్తేసింది

2024 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఆ ఏడు నెలల కాలంలో చనిపోయిన వాళ్లకు బీమా పరిహారం ఇవ్వలేమని చేతులెత్తేసింది. ఈ మేరకు 2024 నవంబరు 4న ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని పునరుద్ధరణ చేయలేదు. ప్రస్తుతం మృతుల వివరాలు కూడా నమోదు చేయలేదు. ఇప్పటికీ గత ప్రభుత్వ నిబంధనలే అమలులో ఉండడంతో ఎక్కువ మందికి న్యాయం జరగడం లేదు.

దుస్తులు ఇస్త్రీ చేస్తున్న ఈ మహిళ పేరు సొగబాలి నాగేశ్వరి. రాయచోటి పట్టణం కొత్తపేట రామాపురానికి చెందిన ఈమె భర్త శ్రీనివాసులు ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ 2020లో గుండెపోటుతో చనిపోయాడు. అతనికి చంద్రన్న బీమా పాలసీ ఉంది. అతను చనిపోయి ఐదు సంవత్సరాలవుతున్నా ఇంతవరకు అతని కుటుంబానికి పైసా కూడా ఇన్సూరెన్స్ డబ్బు రాలేదు. దాని కోసం మృతుడి భార్య సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు. ఆమె గోడు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో విధి లేని పరిస్థితుల్లో ఇప్పుడు దుస్తులు ఇస్త్రీ చేసుకుంటున్నారు. భర్తను కోల్పోయి.. పుట్టెడు దుఃఖంతో కుటుంబ పోషణ బాధ్యతను భుజాలకెత్తుకున్న ఈ మహిళ కన్నీటి వ్యథకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మోసమే కారణం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 ఏప్రిల్ 1 నుంచి చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరణ చేయలేదు. సుమారు ఏడు నెలల పాటు దీని గురించి పట్టించుకోలేదు. ఆ ఏడు నెలల కాలంలో ఉమ్మడి కడప జిల్లాలో సుమారు మూడు వేల మంది చనిపోయారు. ఆ మూడువేల మంది బాధితుల్లో సొగబాలి నాగేశ్వరి ఒకరు.

## కమనీయం... లక్ష్మీనరసింహుడి కల్యాణం

- గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన నరసింహుడు



స్వామి వారి కల్యాణోత్సవం చేస్తున్న వేద పండితులు

గుర్రంకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవాన్ని మంగళవారం టీటీడీ వేద పండితులు కన్నులపండువలా చేశారు. టీటీడీ అధికారులు తెచ్చిన పట్టు వస్త్రాలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి వారిని గరుడ వాహనంపై ఆధిరోహింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. గరుడ వాహనంపై స్వామి వారు పురవీధుల్లో విహరించి భక్తులను కరుణించారు. స్వామి వారి వాహనం ముందు చెక్కభజనలు, కోలాటాలు, కేరళ డ్రమ్ములు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామి వారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వేలాదిగా భక్తులు వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్ భట్టర్, కృష్ణప్రసాద్, కృష్ణరాజ్, అనిల్, గోకుల్, నరసింహులు, ధనుష్, వరద, వెంకీ, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## అగ్నికి ఆహుతైన మామిడి తోట

- కాలిపోయిన మామిడి, అల్లనేరేడు చెట్లు
- సుమారు రూ.4 లక్షల నష్టం



కాలిపోయిన మామిడి, అల్లనేరేడు చెట్ల వద్ద రైతు

తంబళ్లపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు బీడు పొలాలకు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగి మామిడి, అల్లనేరేడు చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీ దిగువముత్రవారిపల్లెకు చెందిన రైతు రఘునాథరెడ్డికి 3 ఎకరాల్లో మామిడి తోట ఉంది. తోట ద్వారా వచ్చిన ఫలసాయంతో రైతు కుటుంబం జీవనం సాగిస్తోంది. సోమవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తోటకు సమీపంలోని బీడు పొలాలకు నిప్పు పెట్టడంతో అవి పెద్దఎత్తున చెలరేగి క్రమంగా మామిడి తోటకు వ్యాపించాయి. మంటలను గుర్తించిన రైతు ఆర్పడానికి ప్రయత్నించినా గాలి ప్రభావానికి అదుపులోకి రాలేదు. దీంతో దాదాపు రెండున్నర ఎకరాల్లో పూత దశలో ఉన్న 30 మామిడిచెట్లు, 30 అల్లనేరేడు, 20 వేప, 20 టేకు చెట్లు కాలిపోయి సుమారు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. దాదాపుగా పదేళ్ల నుంచి తోటను పెంచుతున్నానని, ఇపుడు తోటతో పాటు పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోవడంతో రైతు భోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతును ఆదుకోవాలని తోటి రైతులు, స్థానికులు కోరుతున్నారు.

## పర్యాటక ప్రాజెక్టులను పూర్తి చేయండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యాటక కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పర్యాటకశాఖాధికారి నాగ భూషణం జిల్లాలోని పర్యాటక ప్రదేశాలు, వాటికి సంబంధించిన రహదారుల నిర్మాణం, పర్యాటక ప్రాజెక్టులకు భూమి కేటాయింపు, జిల్లాలో చేపట్టబోయే వివిధ ప్రాజెక్టులు, హార్సిలీహిల్స్‌లో చేపట్టబోయే టెంట్ సిటీ ప్రాజెక్టు తదితర అంశాలపై కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాలకు రహదారుల నిర్మాణం త్వరగా పూర్తవ్వాలని అధికారులను ఆదేశించారు. గిరిజన కార్పొరేషన్ వారు అరకు కాఫీ కోసం అడిగిన స్థలాన్ని కేటాయించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మదనపల్లె సబ్ కలెక్టర్‌ను ఆదేశించారు. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాజెక్టు కింద జిల్లాలో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని జిల్లా పర్యాటకశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీఎఫ్‌వో, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ఒక గది.. నలుగురు సిబ్బంది!** 6

- జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో సిబ్బంది కొరత

**ఉద్యోగాల పేరిట ఘరానా మోసం**

- రూ.17 లక్షలు టోకరా 6

## ఎంపీడీవో రెడ్డెయ్య సస్పెన్షన్

- నిధుల దుర్వినియోగ ఫలితం



ఎంపీడీవో రెడ్డెయ్య

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఎంపీడీవోగా పనిచేస్తున్న రెడ్డెయ్యను సస్పెన్షన్ చేస్తూ జడ్పీ సీఈవో నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఈవోపీఆర్‌డీ ఉషారాణి తెలిపారు. ఒంటిమిట్ట ఎంపీడీవోగా పనిచేస్తున్న సమయంలో 2024-25 సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధులను ఎంపీడీవోతో పాటు మరో నలుగురు సిబ్బంది రూ.6 లక్షలకు పైగా పనులు చేయకుండా దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలడంతో ఎంపీడీవోను సస్పెండ్ చేసినట్లు ఈవోపీఆర్‌డీ తెలిపారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవు

- వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి
- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రాయచోటిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాహనాలను నడపడానికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అని, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం చట్టవిరుద్ధమని, దీనికి జరిమానా తప్పదన్నారు. చట్ట ప్రకారం 18 సంవత్సరాలు నిండని వారు వాహనం నడపరాదని, మైనర్లు వాహనం నడపటం వల్ల వారితో పాటు ఇతరులకు కూడా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. మైనర్లకు వాహనం ఇచ్చిన వారి మీద చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా నేటి యువత రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని వాహనదారులకు ఎస్పీ సూచించారు.

## కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచాలి

- అసెంబ్లీలో పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారి జీతాలు పెంచాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యర్థాలు తొలగించడం, వీధులను శుభ్రం చేయడం, ఇంటింటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించడం, వీధి లైట్లు, తాగునీటి సరఫరా వంటి అన్ని రకాల అత్యవసర పనులను పంచాయతీ కార్మికులు చేస్తున్నారని ఆయన వివరించారు. పీలేరు నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 27 వేల మంది పారిశుధ్య, ఇతర కార్మికులు చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి మెరుగైన జీవనానికి దూరంగా ఉన్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వారి జీతాల పెంపుపై హామీలు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ కష్టాలు తొలగిపోతాయని వారంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ సమస్యపై దృష్టి సారించి పంచాయతీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు.

## రంజాన్ వేళలు



| | ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం) | సెహరీ (గురువారం ఉదయం) |
|---|---|---|
| రాయచోటి | 6.29 | 5.05 |
| మదనపల్లె | 6.31 | 5.10 |
| రాజంపేట | 6.27 | 5.11 |
| పీలేరు | 6.29 | 5.03 |

## కాటమరాయుని సాక్షిగా ప్రభుత్వ స్థలం కబ్జా

- కోట్ల విలువ చేసే భూమి చుట్టూ కంచె
- అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు



ప్రభుత్వ స్థలానికి కంచె వేసిన కబ్జాదారుడు

సుండుపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాటమరాయుడి సాక్షిగా కోట్లాది రూపాయల విలువ చేసే భూమి కబ్జా జరుగుతోంది. దశాబ్దాల కాలం నుంచి ఆ భూమిలో గ్రామస్థులు సంక్రాంతి సంబరాలను వైభవంగా జరుపుకుంటుంటారు. చిట్లాకుప్ప వేసి కాటమరాయుడికి పూజలు చేయడం, పశువులను బెదిరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఆ స్థలాన్ని కబ్జా చేసిన ఓ వ్యక్తి దాని చుట్టూ కంచె వేశాడు. ఆ స్థలం విలువ దాదాపు 2 కోట్ల రూపాయలు ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెన్నంశెట్టిపల్లె వద్ద సర్వే నెంబరు 2103-4లో 40 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ఈ స్థలంలో దశాబ్దాల కాలం నుంచి కాటమరాయుడికి పూజలు చేస్తూ కనుమ పండుగ రోజు చిట్లాకుప్పలు వేయడం, పశువులను బెదిరించడం చేస్తుండేవారు. అయితే ఈ స్థలంపై కన్నేసిన ఓ వ్యక్తి దానిని కబ్జా చేయడానికి పూనుకున్నాడు. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. గతంలో ఆ స్థలం చుట్టూ రాళ్లు నాటిన ఆ వ్యక్తి ఈ ఏడాది సంక్రాంతి పండుగ అయిపోగానే ఆ స్థలం చుట్టూ కంచె నాటాడు. ఆ స్థలాన్ని దైవకార్యం కోసం ఉపయోగిస్తున్నామని, దానిని కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్థులు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాను వెంటనే అరికట్టాలని వెంటనే సంబంధిత మండల స్థాయి అధికారులకు జిల్లా అధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఇనుప కంచెలు వేసి కబ్జా చేస్తే పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించినట్లు సమాచారం. కాగా ఈ స్థలంలోనే గత ఏడాది క్రితం కాటమరాయుని గుడి సమీపంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు భూమిపూజ చేశారు.



ఆక్రమించిన స్థలంలో ఉన్న కాటమరాయుడి గుడి

అప్పట్లో కూడా వెంకన్న ఆలయ నిర్మాణాన్ని జరగకుండా గత ప్రభుత్వంలోని కొంతమంది అడ్డుకున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఏపూరి నరసింహులు అనే వ్యక్తి ఈ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినట్లు దొంగ పట్టాలు సృష్టించారని గ్రామస్థులు చెబుతున్నారు. అసలు ఆ ఊరిలో ఏపూరి నరసింహులు అనే వ్యక్తి లేడు. పైగా ప్రభుత్వ స్థలం నిత్యం దైవ కార్యక్రమాలు చేసే స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారని అధికారులు విచారించి స్థలాన్ని కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### విలువైన స్థలం కాజేయాలని చూస్తున్నారు



ఊరికి సమీపంలో విలువైన స్థలం ఉంది. కాజేయాలని చూస్తున్నారు. దేవుడి కార్యక్రమాలకు కూడా అడ్డుపడుతున్నారు. అందుకే సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశాను. కోర్టు పేరు చెప్పి అధికారులను బెదిరించుకుని ఇనుప కంచె వేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎంతమంది అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడి యధావిధిగా దైవ కార్యక్రమాలకు స్థలం వినియోగించుకునేలా చూడాలి.

- రామాంజులు, చెన్నంశెట్టిపల్లి

### విచారించి చర్యలు తీసుకుంటాం

సోమవారం హైకోర్టుకు వచ్చాను. మంగళవారం కూడా విజయవాడలోనే ఉన్నాను. ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటాను. హైకోర్టు నుంచి వచ్చిన వెంటనే ఆ స్థలంపై విచారణ చేస్తాను.

- దైవాధీనం, తహసీల్దార్, సుండుపల్లె



**కాసులు కురిపించే పంటలు సాగు చేస్తున్నా.. ఆశించిన స్థాయి కన్నా అధికంగానే దిగుబడులు సాధిస్తున్నా. అదును చూసి అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో నష్టపోతున్నామని రాజంపేట వ్యవసాయ డివిజన్‌లోని ఉద్యాన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**



రవాణాకు సిద్ధంగా ఉన్న అరటి గెలలు

# దిగుబడులొస్తున్నా.. నిలువ సామర్థ్యం ఏదీ?

- ఉద్యాన పంటలకు నెలవు రాజంపేట
- ఏడాదికి వెయ్యి కోట్ల ఫలసాయం..
- శీతల గిడ్డంగులు లేక ఏటేటా భారీగా నష్టాలు

రాజంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రధానమైన ఉద్యానవన పంట మామిడి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, వీరబల్లె, పుల్లంపేట మండలాల్లో మామిడి చెట్లు లేని ఊర్లే లేవు. సుమారు 30 వేల ఎకరాల్లో బేనీషా, నీలీషా, తోతాపురి, అంటుమామిడి, రుమాని, పోలూరు, మల్గూబా తదితర 30 రకాల మామిడి కాయలను పండిస్తారు. కోడూరు మార్కెట్‌యార్డు ద్వారా దేశంలోని అన్ని నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. వీరబల్లి మామిడికి అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దఎత్తున డిమాండ్ ఉంది.

### అరటి సాగుచేయని ఊరు లేదు

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తారు. ఏడాది పొడవునా దిగుబడి వచ్చే ఈ పంట కారణంగా రూ.400 కోట్లకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ఎకరాకు రూ.4 లక్షలు తక్కువ లేకుండా ఆదాయం వస్తుండగా, ఖర్చులు పోను 3 లక్షలు రైతుకు మిగులుతోంది.

### భారీగా బొప్పాయి సాగు

ఈ డివిజన్‌లో 25 వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతుండగా, రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. ఏడాదిలో 6 నెలలు ఈ వ్యాపారం సాగుతుంది. ఒక్కో ఎకరాకు సాగు ఖర్చులు పోను 3 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

### ఏడాది పొడవునా.. నిమ్మ

అనాదిగా ఈ ప్రాంతాల్లో ప్రధాన ఆదాయ వనరు నిమ్మ పంట. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పెరగడం, ధర తగ్గిపోవడంతో, క్రమేణా ఈ పంట సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో సాగయ్యే ఈ పంట వల్ల రమారమి 10 కోట్ల ఆదాయం వస్తుంది.

### కోల్డ్ స్టోరేజీలు లేక..

రెండు నియోజకవర్గాల్లో ఉద్యాన పంటల ద్వారా వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతోంది. అయితే సీజన్‌లో ఒక్కసారిగా దిగుబడులు అధికంగా రావడంతో డిమాండు తగ్గిపోయి ధర పడిపోతోంది. నిలువ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టం వస్తున్నా సరే తప్పనిసరై అమ్ముకోవాల్సి వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో పంట దిగుబడులను నిలువ చేసుకుని డిమాండ్ పెరిగిన తర్వాత విక్రయిస్తే మరింత అధికంగా ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉంది. అందుకోసం కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయం గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రైతులు విజ్ఞప్తి చేయడంతో ఆ మేరకు వారు హామీ ఇచ్చారు.





నిలువ చేసే అవకాశం లేక పారవేసిన నిమ్మకాయలు

### శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి



రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో శీతల గిడ్డంగులను ఏర్పా టు చేయాలి. ప్రజా ప్రతినిధులు వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలి. ప్రతి మండల కేంద్రంలో ఒక్కో కోల్డ్ స్టోరేజి ఉంటే రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- గుడారు విష్ణు, రైతు, మిట్టమీదపల్లె, రాజంపేట మండలం.

### ప్రోత్సహించాలి



ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేల కోట్ల రూపాయల ఆదాయం అందించే ఈ పంటలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. శీతల గిడ్డంగులను కచ్చితంగా ఏర్పాటు చేయాలి.

- టి.లక్ష్మీనారాయణ, రైతు, రాజంపేట

## వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు

● ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి



సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని సిద్దవటం రేంజిలోని అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామంలోకి రాకుండా సాసర్ పిట్‌లతో పాటు, పలు నీటి కుంటల్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపామన్నారు. గ్రామంలోకి అడవి జంతువులు, వన్యప్రాణులు వస్తే ప్రజలు వాటికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వన్యప్రాణులకు ప్రాణహాని తలపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## బృందావనాలుగా.. చెత్త కేంద్రాలు : డీఎల్‌పీవో



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

పెద్దతిప్పసముద్రం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన చెత్త కేంద్రాలను (డంపింగ్ యార్డు) సంపదను సృష్టించే బృందావనాలుగా తీర్చిదిద్దుతామని డీఎల్‌పీఓ నాగరాజు వెల్లడించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా పెద్దతిప్పసముద్రం సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను మార్చి నెలాఖరులోగా సరికొత్త హంగులతో బృందావనాలుగా తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కందుకూరు, మద్దయ్యగారిపల్లె, గ్రామాల్లోని డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మునిప్రతాప్‌తో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, విద్యావతి, కొండా శివప్రసాద్, ప్రమీలా, సురేఖ, నాగరాణి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయిని అరికట్టడంలో పోలీసులు విఫలం



మద్దిలేటిని పరామర్శిస్తున్న జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): కడపలో గంజాయి వినియోగం, విక్రయాలను అరికట్టడంలో పోలీసుల విఫల మయ్యారని, వెంటనే గంజాయి అలర్ట్ ప్రక టించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.మద్దిలేటిపై దాడి చేసిన అల్లరిమూకలను అరెస్టు చేయకపోతే ఆందోళన చేస్తామన్నా రు. కాగా మంగళవారం స్థానిక రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దిలేటిని పరామర్శించి గాలి చంద్ర హెచ్చరించారు. కాగా సోమవారం స్థానిక సాక్షి కార్యాలయం తన తమ్ముడు మల్లికార్జునతో కొంతమంది అల్లరిమూకలు గొడవపడుతున్నారని పోయిన మద్దిలేటిపై గంజాయి తాగిన మత్తులో దాడి చేసి గాయపరిచన్నారు. 24 గంటలు అవుతున్నా ఇంతవరకు అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా పాల్గొన్నారు.

## ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు గాయపడినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలి తెలిపారు. ఆయన కథనం మేరకు స్థానిక నీరుగట్టువారిపల్లెలో స్థలం విషయంలో బొమ్మిశెట్టి వెంకటేశ్(50),బొమ్మిశెట్టి రమణమ్మ (70), అదే గ్రామానికి చెందిన కప్పల చంద్ర కుటుంబసభ్యులు గొడవపడ్డారు. ఈ సందర్భంగా కప్పల చంద్ర కుటుంబ సభ్యులతో పాటు వారి మిత్రులు నలుగురు తమపై దాడి చేసి గాయపరిచారని వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షతగాత్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.


## మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిమ్మనపల్లె కస్పాకు చెందిన మమత మంగళవారం పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నం చేసింది, ఆకస్మారక స్థితిలో పడిఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

కలకడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎనుగొండపాలెం పంచాయితీ మొర్రంమీదపల్లెకు చెందిన యువకుడు మంజునాథ్(24) అదృశ్యం కావడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

## నాటుసారా తరలిస్తున్న ఒకరి అరెస్ట్



నాటుసారా, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

రాయచోటిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. మంగళవారం ఆ యన స్థానిక ప్రొహిబిషన్ అం డ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లి పెద్దబిడికి సమీపంలో అటవీ ప్రాంతంలో మంగళవారం దాడులు నిర్వహించి ఆదిరెడ్డినాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, 30 లీటర్ల నాటుసారాను, ఒక మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 60 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలియజేశారు. నిబంధనలను ఉల్లఘించి ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శశిధర్, సిబ్బంది వేమారెడ్డి, మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నట్లు తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీ మృతి

ఓబులవారిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతికి సంబంధించిన ఉపాధి హామీ కూలీ ఎర్రతోటి ఎల్లమ్మ(80) పనికి వెళ్లి తిరిగి వస్తూ గుండెపోటుకు గురై మరణించిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మలరెడ్డి తెలిపారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఏపీవోలు పరామర్శించారు.

## దౌర్జన్యంగా ముగ్గురాయి మైనింగ్

లింగాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూమిలో దౌర్జన్యంగా ముగ్గురాయిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇప్పట్ల గ్రామానికి చెందిన టి.విజయమోహన్‌రెడ్డి తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్‌ఐ మధుసూదన్‌రావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో విజయమోహన్‌రెడ్డికి సర్వేనెంబర్ 434, 435లో 7.7ఎకరాల్లో మైనింగ్ లీజు ఉంది. ఆ భూమిలో పి.ఓబుళరెడ్డి, మనోహర్‌రెడ్డిలు దౌర్జన్యంగా మైనింగ్ చేసి ముగ్గురాయి వెలికితీసేందుకు క్రేన్ బిగించి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ చేయమని రెవిన్యూ వారి దృష్టికి తీసుకెళ్లానని ఎస్‌ఐ తెలిపారు.

## ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.17 లక్షలు టోకరా
- సుండుపల్లెలో కేసు నమోదు
- మోసపోకండి: ఎస్‌ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, మార్చి11: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులను మోసగించిన ఉదంతం మండలంలోని పొలిమేరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన అయ్యప్పరెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. హైదరాబాదుకు చెందిన సాయితేజ, గుంటూరుకు చెందిన, జాషువా, నవ్య ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పొలిమేరపల్లెకు చెందిన ఐదుగురి దగ్గర రూ.17 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోగా రూ.7 లక్షల రూపాయలు వెనక్కి ఇచ్చి మిగిలింది ఇవ్వకుండా చేతులెత్తేశారని ఫిర్యాదు దారుడు ఆవేదన వ్యక్తం చేశారు. వినాయకనగర్, మడితాడు, కుంటలముందరకు చెందిన పలువురు యువకులు కూడా వీరి చేతిలో మోసపోయినట్లు సమాచారం.

### ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మకండి

డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మకండి అని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. నిరుద్యోగ యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ఫోన్లు చేస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## టీడీపీ నేత కారుకు నిప్పు



కారు దగ్ధంపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంటి బయట నిలిపి ఉం చిన తన కారుకు మంగళవారం తెల్లవారుజామున దుండగులు నిప్పు పెట్టినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ వి లేకరులకు తెలిపారు. వేకువజామున పేలుడు శబ్దం వినిపించ డంతో బయటికి వచ్చి చూడగా, టయోటా ఇన్నోవా కారు మంటల్లో కాలిపోతూ కనిపించిందని , టైర్లు కాలి పేలినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న మదనపల్లె ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్ పరామర్శించారు. ఈ దుశ్చర్యకు నిరసనగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, మదనపల్లె నేత తులసిరెడ్డి, కిశోర్‌కుమార్‌గౌడ్ మండల కేంద్రంలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. విజయకుమార్‌గౌడ్ తమ్ముళ్లకు, టీడీపీలోని ఓ సామాజిక వర్గ నేతల నడుమ భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కారు దగ్ధం కావడంతో ఉత్కంఠ నెలకొంది

## చేతులెలా వచ్చాయమ్మా..!

●అప్పుడే పుట్టిన ఆడబిడ్డను..గుట్టలో వదిలి వెళ్లిన తల్లి



గుట్టలో దొరికిన చిన్నారి

ములకలచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి చేతులేలా వచ్చాయో...అప్పుడే పుట్టిన ఆడబిడ్డను బ్యాగులో ఉంచి గుట్టలో వదిలేసి వెళ్లింది. వివరాల్లోకి వెళితే...ములకలచెరువులోని ఉమాశంకర్ కాలనీ సమీపంలో ఉన్న గుట్టలో సోమవారం ఉదయం అప్పుడే పుట్టిన ఆడబిడ్డను ఓ బ్యాగులో ఉంచి తల మాత్రం కనిపించేలా వదిలేసి వెళ్లారు. అటుగా వెళ్ళిన కాలనీకి చెందిన సుమియా అనే మహిళ చిన్నారి ఏడ్పు విని ముందుకెళ్లి చూడగా బ్యాగులో ఆడబిడ్డ కన్పించింది. దీంతో పాపను ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించి, దుస్తులు వేశారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. .

## రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం లభ్యమైనట్లు కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు 20 నుంచి 23 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని యువకుడు నరసాపురం వెళ్లే రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

## చోరీ కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి నగలు అపహరించుకుని వెళ్లినట్లు తాలూకా సీఐ కళా వెంకటరహన తెలిపారు. మదనపల్లె పట్టణం, దేవతానగర్‌కు చెందిన చిన్నరెడ్డెప్ప అరుణ దంపతులు ఈ నెల 9 న ఇంటికి తాళం వేసి అరిగివారిపల్లెకు వెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి వచ్చిన వారికి తలుపులకు వేసిన తాళంతోపాటు, బీరువా పగులగొట్టి ఉండడం కనిపించింది. దీంతో తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. 74 గ్రాముల బంగారు నగలను తస్కరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కనకరుద్రాణి తిరునాళ్లకు ఘనంగా ఏర్పాట్లు

●నేటి రాత్రి పీవీజీపల్లెలో విడిది



కనకరుద్రమ్మ అమ్మవారు

పుల్లంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీవీజీపల్లె, రామసముద్రం పంచాయతీల సరిహద్దులో దేవరకొండ గుట్ట వద్ద వెలసిన కనకరుద్రమ్మ తిరుణాలను ఈనెల 13న అత్యం త వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ చలువపందిళ్లు వేసి రంగు రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. చతుర్దశినాడు కనకరుద్రమ్మ ఊటుకూరు శివాలయం నుంచి బయలుదేరి పల్లె గ్రామంలో రాత్రికి విడిది చేస్తారు. అక్కడ మహిళలు ఉపవాసంతో అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించి దీక్ష పూర్తి చేస్తారు. మరుసటిరోజు తెల్లవారుజామునే కనకరుద్రమ్మ దేవరకొండ గుట్ట వద్ద ఉన్న ఆలయానికి చేరుకుంటారు. అర్చకులు ఆమెకు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో ఆశీనురాలిని చేస్తారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

## ఒక గది.. నలుగురు సిబ్బంది!



మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న క్యాబిన్

- జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో సిబ్బంది కొరత
- పోస్టులు భర్తీ చేయలేదంటున్న అధికారులు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందే దిక్కు..

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి దాదాపు మూడేళ్లు కావస్తున్నా మార్కెటింగ్ శాఖనుసిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. హడావుడిగా జిల్లాలను విభజించిన గత ప్రభుత్వం, అందుకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందనేందుకు మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయం సాక్ష్యంగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డులో చెత్తాచెదారం, కంపచెట్ల నడుమ, పశువుల షెడ్డుకు సమీపంలోని ఒక గదిలో మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఉంది. ఇన్‌చార్జి ఏడీ, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ శాఖకు అవసరమైన కనీస వసతులు కూడా ఇక్కడ కనిపించడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

### పోస్టుల భర్తీ ఏదీ?

కొత్త జిల్లాల్లో పోస్టులు భర్తీ చేయడం లేదు. ఉన్న వారితోనే ఎలాగో కాలం నెట్టుకొస్తున్నాము. మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రమే.. ప్రస్తుత ప్రభుత్వమైనా పోస్టులు భర్తీ చేస్తే బాగుంటుంది.

- త్యాగరాజు, ఇన్‌చార్జి ఏడీ, మార్కెటింగ్‌శాఖ

### పరిపాలన కష్టమవుతోంది

కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలపై శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరం. కొన్ని ఆఫీసుల్లో ఉద్యోగులకు భోజనం, తాగునీటి సౌకర్యం కూడా లేదని తెలిసింది. ఇప్పటికైనా సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

- వంగిమళ్ల రంగారెడ్డి, రైతు సంఘం నేత


## పోలీస్‌స్టేషన్ చేరిన 'పది' ప్రశ్న పత్రాలు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు రూట్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఆంజనేయులు, నారాయణ తెలిపారు. మంగళవారం సెట్-2 ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ జి.రవికుమార్, కానిస్టేబుల్ సమక్షంలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిట్టిబాబు, నారాయణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యువతను మోసగించడంలో దొందూ..దొందే

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతను, విద్యార్థులను నమ్మించి మోసం చేయడంలో టీడీపీ, వైసీపీలు దొందూ దొందే ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రత్యేక హోదా సాధించకుండా ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటివాటిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయిన డీఎస్సీ లేదు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వేలకోట్లు బకాయిలు ఉన్నాయి, వైద్య విద్యను ప్రైవేటు పరం చేయాలనుకోవడం యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

## వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉదయగిరి ఎల్లమ్మ

రాజంపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మన్నూరులో ఉన్న ఉదయగిరి ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఎల్లమ్మను దర్శించుకునేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఉదయం మహిళలు గుడి వద్ద పొంగుబాళ్లు సమర్పించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సాయిస్వామి,ప్రధాన అర్చకులు నాగేంద్రశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

# మోసగాళ్లొస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త

- పేద, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
- నష్టపోతున్న గ్రామీణులు
- బయటకు చెప్పుకోలేకపోతున్న వైనం



**మోసపోయే వాళ్లున్నంత వరకు మోసం చేసే వాళ్లు ఉంటారనేది జగమెరిగిన సత్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మోసాలు కూడా కొత్త రూపం సంతరించుకుంటున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. నష్టపోయిన బాధితులు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు.**

పెండ్లిమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామంలో ఇటీవల పలువురు ఇలా మోసపోయారు. వారం రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు నందిమండలం గ్రామానికి వచ్చారు. తాము బజాజ్ ఫైనాన్స్ నుంచి వచ్చామని, ఎలాంటి ష్యూరిటీలు లేకుండా ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం ఇస్తామని చెప్పారు. రుణం కావలసినవారు రూ.2800 కడితే రూ.50వేలు, రూ.5600 కడితే లక్ష రూపాయలు ఇస్తామని వివరించారు. ఈ మొత్తాన్ని వడ్డీ లేకుండా ప్రతి నెల కంతుల రూపంలో చెల్లించవచ్చని నమ్మించారు. దీంతో సుమారు 200 మందికి పైగా ఫోన్‌పే ద్వారా వారి ఖాతాకు డబ్బు చెల్లించారు. అనంతరం ఏమైనా వివరాలు కావాలంటే సంప్రదించాలని చెప్పి ఓ ఫోన్ నెంబరు కూడా ఇచ్చి వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు డబ్బు కట్టించుకున్న ఫోన్‌పే నెంబరుతోపాటు, ఆగంతు కులు ఇచ్చిన ఫోన్ నెంబరు కూడా పని చేయకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

మరో కేసులో.. గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి సచివాల యం సమీపంలో లక్ష్మీదేవి అనే మహిళను పలుకరించాడు. కేంద్ర ప్రభుత్వం మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేసిందని, దాన్ని డ్రా చేయించి ఇస్తానని నమ్మించాడు. ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును చూస్తే ధనవంతులు అనుకుంటారని, నగదు జమ చేసేదాకా దానిని పక్కన తీసి పెట్టండని చెప్పాడు. దీంతో ఆమె గొలుసు తీసి అతనికి ఇవ్వ డంతో ఆమె కన్నుగప్పి పారిపోయాడు. ఈ విషయంపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దాన్ని రికవరీ చేసి ఇచ్చారు.

**చెప్పుకుంటే అవమానమని..**



ఐటీఐ చదువుకున్న నేనూ బాధితుడినే.. మోసగాళ్ల చెప్పే మాటలు వింటే ఎవరైనా నమ్మేస్తారు. వ్యాపారం పెంచుకుందా మనే ఉద్దేశ్యంతో డబ్బు చెల్లించా. బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నాం.

*- గంగాధర్ రెడ్డి. చిల్లర దుకాణం..*

**ఫోన్‌పే ద్వారా చెల్లించాం..**



పోగొట్టుకున్నది చిన్న మొత్తం కావడంతో పోలీసులకు చెప్పలేక సందిగ్ధంలో పడ్డాం. డబ్బు లేకపోయిన ఇతరుల నుంచి ఫోన్‌పే చేయించుకుని వారికి చెల్లించాం. మాలాగా ఎవరూ మోస పోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

*- దాసరి బ్రహ్మయ్య, చిరు వ్యాపారి*

## 17 టీఎంసీల నీటి నిల్వకు సహకరించండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీరు నిల్వ చేసేందుకు సహకరించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. బ్రహ్మంసాగర్‌ను నిండుగా నింపేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబునాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కోరారు. బ్రహ్మంసాగర్ నిర్మించినప్పటి నుంచి ఒక్క సారి కూడా పూర్తిగా నీటితో నింపలేదని, పూర్తిగా నింపేం దుకు గతంలో కుందూనది నుంచి లిఫ్ట్ ఇరి గేషన్ ద్వారా రూ.528 కోట్ల టెండర్లు పిలవడం జరిగిందని, కానీ పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదన్నారు. బ్రహ్మంసాగర్‌ను నీటితో నిండుగా నింపగలిగితే బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలు పాడి పంటలతో సస్యశ్యా మలం అవుతాయని తెలిపారు. వెంటనే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు బ్రహ్మంగారిమఠంలో డీకేటి భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకు న్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ ద్వారా కమిటీని వేయించి విచారణ జరిపించాలని స్పీకర్‌ను కోరారు.

## రబీ పంటలకు బీమా ఇవ్వని వైసీపీ

- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- శాసనసమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చిన దాఖలాలు లేవని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ ఇచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని మండలిలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాని ఇన్సూరెన్స్ సమస్య గురించి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల ఇన్సూరెన్స్‌ను చెల్లిస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రీమియం సక్రమంగా కట్టకపోవడం వల్ల నష్టపోయిన రైతులకు క్లెయిములు రాలేదన్నారు. జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతంలో బుడ్డశనగ వేస్తారు, ఆ రైతులకు కూడా నష్టపోయిన సమయంలో ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ రాలేదని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బుగ్గ వంక ప్రాజెక్టు పనుల పరిశీలన



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్ఈ అబ్దుల్ షమీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక ప్రాజెక్టు పనులను జయకా ఇంజనీరింగ్ వర్క్స్ కన్సల్టెంట్, రిటైర్డ్ సీఈ సబ్జాన్‌బాష మంగళ వారం పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుల్ షమీతో కలిసి సమీక్ష నిర్వహించారు. జయకా నిధులతో చెరువులు అభివృద్ధి చేసుకోవచ్చు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ఇరిగేషన్ రెగ్యులర్ ఈఈ వెంకటరామయ్య, వెలిల్లు ఈఈ శ్రీనివాసులరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మునీర్ బాష తదితరులు పాల్గొన్నారు.



## పది పరీక్షల్లో విరామం... ఎంతో ఉపశమనం

కడప ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశకు తొలి అడుగైన పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ సహజంగా వారిలో ఒత్తిడి పెరుగుతుంది. అధిక శాతం విద్యార్థులు పగలు, రాత్రి కష్టపడి చదవి పరీక్ష రోజున మర్చి పోతుంటారు. దీంతో ఆశించిన మార్కులు రాక నిరాశకు లోనవుతారు. గతంలో విద్యార్థులు పడిన ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జర గనున్న పదో తరగతి పరీక్షల్లో ఒక రోజు విరా మం ఉండేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. దీని వల్ల ఒత్తిడి తగ్గి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ విధానం అమలు చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ అవకాశాన్ని వినియోగంచుకుంటాం...**



ఏడాదిలో పలు దఫాలుగా జరిగే సాధారణ పరీ క్షల సమయంలోనే కనిపించని ఒత్తిడి ఉంటుంది. అలాంటిది పబ్లిక్ పరీక్షల్లో ఉండడం సహజం. దాన్ని అధిగమించేందుకు విద్యాశాఖ అందించిన విరామ సమయాన్ని అవకాశంగా మలుచుకుంటాం.

-మానస, విద్యార్థిని.

**ప్రతి నిమిషం ఎంతో ఉపయుక్తం**



పరీక్షల వేల గంట సమయం కూడా ఎంతో విలువైనది అని తొలి నుంచి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాంటిది ఇపుడు ఏకంగా 24గంటల సమయం దొరుకుతోంది. ఇది మార్కుల సాధనకు ఎంతో దోహదపడుతుంది. తద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.

-హరిణి, విద్యార్థిని.

**విద్యార్థులకు వరం**



రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు వరమనే చెప్పాలి. గతంలో ఎప్పుడు ఇలాంటి అవకాశం కల్పించలేదు. దీన్ని వినియోగించుకొని ఏడాది మొత్తం చదివిన వాటిని మరో మారు గుర్తు చేసుకోవాలి. పరీక్షలకు వెళ్లే ముందు భయాన్ని విడిచి నమ్మకంతో ఉండాలి.

-మాబున్నీ, ఉపాధ్యాయులు, కడప.

**పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తారు**



ప్రభుత్వం విద్యార్థులకు గొప్ప అవకాశం కల్పించింది. ప్రస్తుతం వంద మార్కులకు ఒకే పేపర్ ఇస్తున్నారు. కీలకాంశాలు, సూత్రాలపై దృష్టిపెట్టి పరీక్షలు బాగా రాసే అవకాశం ఏర్పడు తుంది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించాలి.

-మేరి, ప్రధానోపాధ్యాయని, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, చెమ్ముమియాపేట, కడప.

## కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేసిన జేసీ



భూమి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

వల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వల్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జాయింట్ కలెక్టరు అదితిసింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రత్యేక అధికారిణితో సమావేశమయ్యారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికల కోసం శ్రద్ధ వహించాలని.. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. బాలికలకు కాస్మోటిక్స్, ఇతరత్రా వస్తువులు నెలనెలా సక్రమంగా అందుతున్నాయా అని అడిగారు. అలాగే మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఆర్డీవో జాన్ ఎర్విన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

**వివాదాస్పద భూమిని పరిశీలించిన జేసీ**

సీకేదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలోని వివాదాస్పద భూమిని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. పోలిరెడ్డి లేపాక్షిరెడ్డి సోమవారం గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిసింది. ఆర్‌హెచ్ ప్రకారం అనుభవంలో తమ పేరుతో ఉండే భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఎక్కడంతో వారు తన 5.20 ఎకరాల భూమిని ఎకరా రూ.60లక్షలతో అమ్ముకున్నారు. ఆ విషయం తెలిసి బాధితుడు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తానని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



మియాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. కడప ప్రాంతానికి చెందిన జహర్‌బాను, అమర్‌బాష చిన్న కుమారుడు రోషన్ (27) మూడు సంవత్సరాలుగా చందానగర్‌లో ఉంటూ హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్థరాత్రి రోషన్ బయటకు వెళ్తున్నానని చెప్పి తన రూమ్ మేట్ భార్గవ్‌కు చెప్పి బుల్లెట్ వాహనంపై బయటకు వెళ్లాడు. చందానగర్ జాతీయ రహదారిపై మియాపూర్ వెళ్తుండగా దీప్తిశ్రీనగర్ వద్ద కమాన్ మలుపు వద్ద ముందువెళ్తున్న టిప్పర్‌ను ఓవర్ టెక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోషన్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతిచెందాడు.

## మాలేపాడు సర్పంచి చెక్‌పవర్ రద్దు

ఎర్రగుంట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలేపాడు గ్రామ సర్పంచి కుప్పన్నగారి శకుంతలమ్మ చెక్‌పవర్‌ను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి రద్దు చేశారు. గ్రామంలో ఆర్డీపీపీ సహకా రంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణ కోసం ఆర్డీపీపీ నిధులు మంజూరు చేసింది. ఇందు కు సంబందించిన నిధులను గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా 2021 నుంచి 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.23,21,101 నిధులను డ్రా చేశారు. పంచాయతీ తీర్మా నం లేకుండా నిధులు డ్రా చేసినట్లు విచారణలో తేల డంతో డీపీవో చెక్‌పవర్ రద్దు చేసినట్లు ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య తెలిపారు. ప్రస్తుతం రద్దు చేసిన చెక్‌ప వర్‌ను ఈవోపీఆర్‌డీకి ఇచ్చారు.

## రూ.2 కోట్లతో ఉడాయించిన వ్యాపారి?

ఖాజీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో కిరాణాషాపు నిర్వహిస్తున్న శివనాగరాజు రూ.2 కోట్లతో ఉడాయించాడు. ఇతను మూడేళ్ల క్రితం అనంతపురం జిల్లా నుంచి వచ్చి కిరాణాషాపు నడుపుతూ ఉండేవాడు. మంగళవారం 'ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో రుణదాతలు షాపు వద్ద గుమికూడారు. నాగరాజు సమీప బంధువుతో దుకాణాన్ని తెరిపించారు. అందులో సరుకులు ఏమీ లేకపోవడంతో ఆశ్చర్యపడ్డారు. దుకాణం యజమాని పక్కా ప్రణాళికతో ఉడాయించినట్లు నిర్ధారించుకున్న రుణదాతలు కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నాగరాజుకు మాత్రం వ్యాపారంలో నష్టం రాలేదని, అంతా దోచుకుని దాచుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

## అనుమతిలేకుండా అబార్షన్లు, ఆపరేషన్లు... ఆసుపత్రి సీజ్





ఫ్లోరెన్సు ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్య అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం విజయనగరం వీధిలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా అబార్షన్లు, అపరేషన్లు చేస్తున్న ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రిని వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఫ్లోరెన్సు ఆసుపత్రికి కేవలం ఒక జనరల్ ఫిజీషియన్ వైద్య సేవలు అందించేందుకు అనుమతి తీసుకొని ఏకంగా మహిళలకు సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, అబార్షన్‌లు చేస్తున్నారు. దీంతో ఈ ఆసుపత్రిని 2021లోనే సీజ్ చేశారు. మళ్లీ 2023 ఏప్రిల్ 12న పర్మిషన్ తీసుకున్నారు. అప్పుడు కూడా జనరల్ ఫిజీషియన్‌కు వైద్యశాఖ నుంచి 6 పడకలకు అనుమతులు తీసుకున్నారు. గైనకాలజిస్టు సేవలకు దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇవ్వలేదు. అయినా 2025 ఫిబ్రవరి నెలలో సిజేరియన్ ఆపరేషన్లు, సాధారణ కాన్పు లు, అబార్షన్‌లు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఆమేరకు మంగళవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే పీవో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, డెమో భారతి, రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు మణికుమార్ వెంకటేశ్వర్లు లీగల్ సెల్ అథారిటీ పాలేశ్వరరావులు కలిసి ఫ్లోరెన్సు ఆసుపత్రిని సీజ్ చేశారు.

**ఆర్డీవో సాయిశ్రీ విచారణ :** ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రిలో భావన అనే గర్భిణి 2025 ఫిబ్రవరి 24న చేర్చుకొని అనధికారికంగా ఆమెకు వారాహి ఆసుపత్రిలో వున్న లోకేశ్వర్ అనే వైద్యుని పిలిపించి సాధారణ ప్రసవం చేశారు. పుట్టిన బిడ్డను తల్లి భావన అనుమతి లేకుండా వారాహి ఆసుపత్రికి తీసుకెళ్లి అనేక పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత శిశువులో ఎటువంటి వృద్ధి లేనందున 2025 మార్చి 3న తల్లిదండ్రులు కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మూడు రోజుల వైద్యం అందించినా శిశువు మరణించినట్లు భావన ఆర్డీవో సాయిశ్రీకి తెలిపారు. ఈ మేరకు ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రి, వారాహి ఆసుపత్రిపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్‌రెడ్డిలు వున్నారు.

## గ్లకోమాపై అవగాహన ర్యాలీ




కడపలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా మంగళవారం కడపలో మహవీర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కడపలోని పుష్పగిరి విట్రియోరెటీనా ఇనిస్టిట్యూట్, డీబీసీఎస్ సమన్వయంతో గ్లకోమాపై ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి బాబు, డీపీఎం డాక్టర్ సునీత జెండా ఊపిప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వల్ల నిశ్శబ్ద కిల్లర్ గ్లకోమాను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ దినేష్ గ్లకోమా శస్త్రచికిత్సలపై మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు గ్లకోమాపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), మార్చి11 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖలో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నగరంలోని మట్టి పెద్దపులి వద్ద ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు.

పూర్తి వివరాలకు 08562272829, 9441513490 నెంబరును సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ.11,770 గౌరవ వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈ పోస్టుకు తగిన అభ్యర్థిని ఎంపిక చేస్తారని తెలిపారు. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

# ఎండలు ముదరకముందే గొంతెండుతోంది



కొత్తపేట మొదటివీధిలో గేటు వాల్ ఏర్పాటు కోసం తవ్విన గుంత



చందనశ్రీ ఒకేషనల్ కళాశాల వీధిలో మురుగునీటిని చూపుతున్న మహిళలు



శ్రీనివాస స్కూల్ వీధిలో రంగు మారిన వెలిగల్లు నీరు

- రాయచోటిలో నీటి కష్టాలు
- రంగు మారిన నీళ్లు వస్తున్నాయని ప్రజల ఆందోళన
- సచివాలయం వీధిలో నీటి కోసం ఎదురుచూపు
- పట్టించుకోని అధికారులు

రాయచోటిటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో వేసవి కాలం రాకముందే నీటి కష్టాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి పట్టణానికి వస్తున్న నీటి సరఫరాలో అధికారుల అలసత్వం-సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పలు ప్రాంతాల్లో రంగు మారిన నీళ్లు వస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రాయచోటి పట్టణంలోని బోస్‌నగర్‌లోని చందనశ్రీ ఒకేషనల్ కళాశాల వీధిలో నీళ్లు వదిలిన సమయంలో అర్ధగంటపాటు మురుగునీరు తాగునటిలో కలిసి వస్తుండడంతో ఆ ప్రాంత వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో 40 సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన పైపులైన్ మురుగునీటి కాలువలతో కలిసిపోయి మురుగునీరు, వెలిగల్లు నీరు కలిసి వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు స్థానిక కౌన్సిలర్ల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ఫలితం లేదని ఆ వీధి వాసులు వాపోతున్నారు. దీనికి తోడు కొత్తపేటలోని బోస్‌నగర్ సమీపంలో గల శ్రీనివాస స్కూలు వీధిలో కూడా రంగు మారిన నీళ్లు వస్తుండడంతో తాగడానికి పనికిరాకపోగా కనీసం బట్టలు ఉతుక్కునేందుకు కూడా పనికిరాకుండా ఉండడంతో ఆ ప్రాంత ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితిలు నెలకొన్నారు. ఇదిలా ఉండగా తాజాగా మున్సిపల్ పరిధిలోని కొత్తపేట మొదట వీధి (సచివాలయం వీధిలో) గత పది రోజులుగా మున్సిపాలిటీ నీళ్లు వదలకుండా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పైపులైన్‌లో గేట్ వాల్ పగిలిపోవడంతో నీళ్లు వదలకుండా ఉన్నామని వాటర్ సెక్షన్ సిబ్బంది చెబుతున్నారు. గేట్ వాల్ పగిలిపోయిందని మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని వాటర్ సెక్షన్ సిబ్బంది చెడుతున్నారు. గేట్ వాల్ పగిలిపయిందని పది రోజుల పాటు నీళ్లు ఆ వీధులకు రావని, ప్రజలు జాగ్రత్తగా నీటిని వాడుకోవాలని ముందస్తు జాగ్రత్తలు కూడా మున్సిపల్ అధికారులు తెలియజేయకపోవడంతో వెలిగల్లు నీటిని నమ్ముకున్న ప్రజలు కష్టాలు తప్పడం లేదు. బుధవారం శివరాత్రి పండుగ వస్తున్న సందర్భంగా స్నానానికి, బట్టలు శుభ్రం చేసుకునేందుకు, గృహాలను శుభ్రపర్చుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ ప్రజలు మున్సిపల్ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా కూడా అధికారులు స్పందించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి నెలలోనే నీటి కోసం ఇన్ని కష్టాలు ఉంటే రాబోయే మార్చి, ఏప్రిల్, మే నెలల్లో నీటి కోసం ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం నీటి పన్ను, ఇంటి పన్ను, కుళాయిపన్ను ఇలా అన్ని రకాల పన్నులను మాత్రం క్రమం తప్పకుండా రాబడుతున్నారు. అదే స్థాయిలో మౌళిక వసతులు కల్పించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారని చెప్పడంలో సందేహం లేదు. సంబంధించిన అధికారులు స్పందించి పైపులైన్ వెంటనే మరమ్మతులు చేపట్టి నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అధికారుల పర్యవేక్షణ లోపంతోనే రంగు మారిన నీళ్లు



వెలిగల్లు ప్రాజెక్టు నుండి రాయచోటి పట్టణానికి సరఫరా అవుతున్న నీరు రంగు మారడానికి మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో లోపమే కారణం. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి వెలిగల్లు నీటిని ప్యూరిఫై చేసి రాయచోటి పట్టణ ప్రజలకు అందిస్తున్నప్పటికీ చాలాసార్లు నీళ్లు ఎర్రగా, మురికిగా వస్తున్నాయి. లక్షలు వెచ్చింది ప్యూరిఫై చేస్తున్నప్పటికీ వెలిగల్లు నీరు తాగడానికి పనికి రా వడం లేదు. దీనికి తోడు రాయచోటి పట్టణంలో చాలా చోట్ల పైపులైన్ డ్రైనేజీ కాలువలకు పక్కనే ఉండటం వలన నాసిరకంగా ఉన్న పైపులు పగిలిపోయి డ్రైనేజీ నీరు అందులో కలిసి కలుషితమై వస్తున్నాయి. అధికారులు చొరవ తీసుకొని పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి.

\- వంగిమళ్ల రంగారెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

## నిరుద్యోగులకు ఉపాధే లక్ష్యం

- సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్



మాట్లాడుతున్న పంతగాని

రైల్వేకోడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఆసరా లేక అనేక ఇబ్బందులు పడిన పరిస్థితిని కళ్లారా చూశామన్నారు. కూటమి ప్రభుత్వం వస్తానే జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 12న నాలుగు ప్రముఖ కంపెనీల ప్రతినిధుల చేత ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశామన్నారు. 1045 మందికి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పలు ఉద్యోగాల కోసం ప్రణాళిక ఏర్పాటు చేసుకున్నారన్నారు. రైల్వేకోడూరు ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు.

## 'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి

సుండుపల్లె, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులకు కరపత్రాలు అందించి ప్రచారం నిర్వహించారు. పంచాయతీ కార్మికులు, వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా ఐదో తేదీన జీతం ఇవ్వాలని,కార్మికులను తిరిగి తీసుకోవాల పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుంది

రైల్వేకోడూరు రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతందని డాక్టర్ బ్రహ్మకుమారి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు.



## విద్యాసామగ్రి పంపిణీ

పెనగలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : టీవీ సెలబ్రిటీ హనీ ముందస్తు పుట్టినరోజు సందర్భంగా పెనగలూరు, మూగవారిపల్లె దళితవాడలకు చెందిన అభిమానులు మంగళవారం సి.కొత్తపల్లె ఎలిమెంటరీ పాఠశాలలో 23 మంది విద్యార్థులకు ఎంఈవో-1 గిరివరదయ్య అధ్యక్షతన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పలకలు, నోటుపుస్తకాలు, బ్యాగులు, పెన్సిళ్లు తదితర వస్తువులను ఈ సందర్భంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ టీచర్ వెంకటరమణ, సహోపాధ్యాయురాలు సుబ్బరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అదనపు సహాయం

పెనగలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలంలో 2019 నుంచి 2024 సంవత్సరం మధ్యకాలంలో పక్కా గృహాలు పొంది నిర్మాణం మధ్యలో ఆపివేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు ప్రభుత్వం అదనంగా రూ.50 వేలకు మంజూరు ఉత్తర్వులు జారీ చేసిందని హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్ తెలిపారు. ఎస్సీలు 135 మంది, ఎస్టీలు 27 మంది, బీసీలు 88 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఇందులో ఎస్టీలకు 75 వేల రూపాయలు ఇస్తుందన్నారు. మధ్యలో గృహనిర్మాణాలు ఆపివేసిన లబ్దిదారులు వెంటనే నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## మల్లూరమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

చిన్నమండెం, మార్చి11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ మాండవ్యనది ఒడ్డున వెలిసిన మల్లూరమ్మ జాతర ఈ నెల 13, 14వ తేదీల్లో జరుగుతుండడంపై అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఆలయం వద్ద సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ జాతరకు 50 వేల మంది భక్తులు వస్తారని అంచనాలతో భక్తులు వస్తారన్న అంచనాతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఐదు చోట్ల పార్కింగ్ స్థలాలు, డ్రోన్ కెమెరాలు, ఐదు మూవింగ్ పార్టీలు, స్పెషల్ పార్టీలతో గట్టి ఏర్పాటు చేస్తున్నామని జాతరకు దాదాపు 250 మంది పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు. అయితే చాందినీ బండ్లు కట్టే నిర్వాహకులు చాందినీ బండ్లు ఎత్తున పోలీసు వారు సూచించినట్లు కట్టుకోవాలని, అలాగే ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలకు తావు లేకుండా అశ్లీల నృత్యాలు ఉండరాదని సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ పెద్దలు సర్పంచులు జాతరకు సహకరించాలని జబర్దస్త్, చెక్కల భజనలు, కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎన్నో కార్యక్రమాలు అపురూపురిచేలా ఈ సంవత్సరం చేయబోతున్నామని దీనికి గ్రామ ప్రజలు సహకారం ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఈవో కొండారెడ్డి సర్పంచులు ముసల్‌రెడ్డి, నజీర్, లక్ష్మిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## కబడ్డీ, పరుగుపందెంలో ప్రతిభచాటిన అన్నమాచార్య విద్యార్థులు



బహుమతులు అందిస్తున్న దృశ్యం

రాజంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అన్నమాచార్య యూనివర్శిటీలో బీఫార్మసీ విద్యను అభ్యసిస్తున్న డి.అక్బర్ వలీ, టి.వినోద్‌కుమార్, వై.సాయిమేఘనాధ్‌రెడ్డి, డి.గణేష్, ఎస్.హుస్సేన్, ఎం.మహేష్‌బాబు, జి.వెంకటప్రవీణ్, డి.తరుణ్ బృందం ఇటీవల గుంటూరులోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామసూటికల్స్ నిర్వహించిన మిలాన్ ఉత్సవ్ రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. అలాగే పరుగు పందెంలో ఫార్మడీలో మూడో సంవత్సరం చదువుతున్న డి.గణేష్ రెండో బహుమతి సాధించడంతో కళాశాల వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి వారిని అభినందించారు. కళాశాల స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎం.మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.హంజాబేగ్‌లు పాల్గొన్నారు. కళాశాల యాజమాన్య కార్యదర్శి డాక్టర్ సి.గంగిరెడ్డి, కోశాధికారి సి.అభిషేక్‌రెడ్డి, ఛైర్మన్ సి.రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ విజేతలుగా నిలిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ఆటల పోటీల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులు పోటీల్లో చక్కటి ప్రదర్శన కనబరచాలని తెలిపారు.




## ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ తప్పనిసరి

- జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం

రాయచోటి టౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం పేర్కొన్నారు. రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులో గల అర్చన కళాశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యంతో పాటు దేశభక్తి, సేవాభావం అలవడుతుందన్నారు. అంతేగాక స్కౌట్ విద్యార్థులకు ఇంజనీరింగ్, వైద్య, విద్య తదితర అడ్మిషన్స్‌లో, రైల్వే ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నిజాయితీ, సుగుణశీలత, ధైర్య సాహసాలు, సేవాగుణం అలవడుతుందన్నారు. హెచ్‌ఎం బ్యూటీ నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు నాగరాజ, గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.50 లక్షలతో తాగునీటి పైపులైను పనులు

నందలూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లతిమ్మయగారిపల్లె నడిగడ్డ అగ్రహారం నుంచి చెన్నయ్యగారిపల్లె వరకు శ్యాంప్రసాద్ ముఖర్జీ అర్బన్ మిషన్ కింద రూ.50 లక్షలతో తాగునీటి పైపులైను పనులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం ప్రారంభించారు. గతంలో టెండర్లు పిలవడం జరిగిందని, ఆలస్యం కావడంతో నిధులు వెనక్కు వెళుతున్న తరుణంలో ప్రత్యేకంగా అనుమతి తీసుకుని కాంట్రాక్టర్ సందీప్‌కు పనులు ఇచ్చామన్నారు. ఈ పనులను ఎంపీపీ మేడా విజయశేఖర్‌రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నాణ్యమైన పైపులతో పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 38 అడుగుల లోతులో నీరు పడ్డాయని తెలపడంతో మార్చి, ఏప్రిల్ నాటికి డ్రై అయిపోతాయని, 80 అడుగుల లోతులో బోరు వేస్తే ఎప్పటికి నీరు ఉంటుందని తెలిపారు. ఎక్కువ లోతులో వేయడం వల్ల కలకాలం నీరు అందుబాటులో ఉంటుందని అలా వేయడం వల్ల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అధికారులకు సూచించారు.




## విద్యార్థి, యువత భవితను దెబ్బతీసింది జగనే : టీఎన్‌ఎస్‌ఎఫ్

రాజంపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని విద్యార్థి, యువత భవిష్యత్‌ను హరించివేసింది ఒక్క జగనేనని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్ తెలిపారు.మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్‌తో కలిసి మాట్లాడుతూ వైసీపీ పార్టీ ఈనెల 12న చేపట్టే ఫీజు పోరు కార్యక్రమం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటిముందు చేయాలన్నారు. రూ.4,271 కోట్లు ఫీజు వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్‌రెడ్డి ప్రభుత్వమే కదా అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల్లోనే విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ 788 కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. టీఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ ఉపాధ్యక్షులు శివప్రసాద్, నియోజకవర్గ నాయకులు ముభిసిర్ పాల్గొన్నారు.

## పోలీసుల అనుమతి లేకుండా ర్యాలీ నిషేధం

పుల్లంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట డివిజన్ పరిధిలో 30 పోలీసు యాక్టు అమల్లో ఉన్నందున ధర్నాలు, ర్యాలీలు, దీక్షలు, ఊరేగింపులు చేయడం నిషేదమని పుల్లంపేట ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా పై కార్యక్రమాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

## ప్రమాద బాధితులకు అండగా ఉంటాం

ఓబులవారిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్న ఓరంపాడు గ్రామ పంచాయతి అయ్యలరాజుపల్లె హరిజనవాడకు చెందిన నాదెండ్ల గౌరయ్య(45) అనేవ్యక్తి లారీ ప్రమాదంలో మృతిచెందగా పరామర్శించడం జరిగింది. మంగళవారం మృతిచెందిన గౌరయ్య కుటుంబ సభ్యులను స్థానిక టీడీపీ నాయకులతో కలిసి పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాధిత ఉటుంబ సభ్యులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీవో కమ్మపల్లె టీడీపీ నాయకులు పయ్యావుల కోటేశ్వరరావు, తొండపు ఈశ్వరయ్యనాయుడు, మాజీ ఎంపీటీసీ రవీంద్రనాయుడు, పోతిన రమణ తదితరులు పాల్గొన్నారు.

## 17న 'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని పీటీయంపల్లిలో జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు 3 నెలల నుంచి 8 నెలల వరకు రావాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పంచాయతీ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు రామాంజులు, ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రీన్ అంబాసిడర్‌లకు, కొన్ని పంచాయతీలకు పూర్తిగా చెల్లించలేదన్నారు.

## సంక్షిప్తం

### మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రాంప్రసాద్‌రెడ్డి



మంత్రి లోకేశ్‌ను కలిసిన అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాయచోటి మండల టీడీపీ నేత అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతపురం జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వచ్చిన లోకేశ్‌ను సోమవారం రాత్రి కడప విమానాశ్రయంలో స్వాగతం పలికారు.

### టీడీపీలో యువతకు పెద్దపీట

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం యువతకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మేనల్లుడు మౌర్యరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం గ్రామం గంగమ్మజారలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌర్యరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యువతకు పెద్దపీట వేస్తున్నారన్నారు. టీడీపీ మండల యువజన నాయకుడు యనమల మదన్‌మోహన్, వేణు, సాయి కావలి ఆంజనేయులు, రెడ్డెప్పరెడ్డి, బాబు, వెంకటేశ్వర్లు, రామచంద్ర పాల్గొన్నారు.

### జాగ్రత్తలు తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి గ్రస్తుడు తుమ్మినా, దగ్గినా గాలి ద్వారా క్షయ వ్యాపిస్తుందని, జాగ్రత్తలు తప్పనిసరి అని క్షయవ్యాధి అధికారి హరి పేర్కొన్నారు. మంగళవారం కో నంపేట గ్రామం జాండ్రపల్లె జడ్పీహైస్కూల్‌లో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎం రామక్రిష్ణ, సీహెచ్ ఓ రవీంద్ర, సిహెచ్‌చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



సాయం అందిస్తున్న ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట దళితవాడకు చెందిన రేవూరి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో మంగళవారం ఆయన కుటుంబానికి ముక్కా ఫౌండేషన్ ద్వారా ముక్కా వరలక్ష్మి రూ.25,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముక్కా ఫౌండేషన్ ద్వారా అవసర మైన ప్రతి ఒక్కరికీ సాయం చేస్తామని భరోసా ఇచ్చారు.

### కలలు సాకారం చేసుకోవాలి

రైల్వేకోడూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి తమ కలలను సాకారం చేసుకోవాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ ప్రభుదాస్ తెలిపారు. శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వేకోడూరులోని ఎస్సీ బాల, బాలికల హస్టల్‌లో పరీక్షల సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి సొసైటీ వ్యవస్థాపకుడు మడగలం ప్రసాద్ మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా పిల్లలకు ఉచితంగా అట్ట, పెన్ను, పెన్సిల్, రబ్బరు తదితర పరీక్షా సామగ్రి ఇచ్చినట్లు తెలిపారు. హస్టల్ వార్డెన్ రోష్ణ, సభాపతి, మడగలం మణి తదితరులు పాల్గొన్నారు.

### 'భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయండి'

సిద్దవటం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : భూ కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని మండల మాజీ అధ్యక్షుడు సామా శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శాఖరాజుపల్లె, పెద్దపల్లె రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, వాగులనుకబ్జా చేశారని, చర్యలు తీసుకోవాలన్నారు.

### పరిశుభ్రత పాటించండి

సిద్దవటం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ పేర్కొన్నారు. పెద్దపల్లె, బాకరాపేట, శివునిపల్లె తదితర గ్రామాల్లో మంగళవారం శానిటేషన్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

### రాయచోటి ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

రాజంపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాయచోటిలో నిర్వహించిన వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవంలో జరిగిన దాడి ఘటనకు బాధ్యులను గుర్తించి శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరసింహారెడ్డి, మదనపల్లె డీఎస్పీ ప్రకాష్, స్థానిక సీఐలు పరుష పదజాలంతో హిందువులపై అసభ్య పదజాలంతో మాట్లాడుతూ లాఠీ చార్జ్ చేశారన్నారు. బీజేపీ నేతలు ఆదినారాయణ, వీవీ రమణ, రమణారెడ్డి, చిన్నయ్య, తోట నాగేష్ తదితరులు పాల్గొన్నారు.





# దిగుబడులొస్తున్నా.. నిలువ సామర్థ్యం ఏదీ?

**కాసులు కురిపించే పంటలు సాగు చేస్తున్నా.. ఆశించిన స్థాయి కన్నా అధికంగానే దిగుబడులు సాధిస్తున్నా. అదును చూసి అమ్ముకునేందుకు అవకాశం లేకపోవడంతో నష్టపోతున్నామని రాజంపేట వ్యవసాయ డివిజన్‌లోని ఉద్యాన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.**

- ఉద్యాన పంటలకు నెలవు రాజంపేట
- ఏడాదికి వెయ్యి కోట్ల ఫలసాయం..
- శీతల గిడ్డంగులు లేక ఏటేటా భారీగా నష్టాలు

రాజంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో ప్రధానమైన ఉద్యానవన పంట మామిడి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, వీరబల్లె, పుల్లంపేట మండలాల్లో మామిడి చెట్లు లేని ఊర్లే లేవు. సుమారు 30 వేల ఎకరాల్లో బేనీషా, నీలీషా, తోతాపురి, అంటుమామిడి, రుమాని, పోలూరు, మల్గూబా తదితర 30 రకాల మామిడి కాయలను పండిస్తారు. కోడూరు మార్కెట్‌యార్డు ద్వారా దేశంలోని అన్ని నగరాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తుంటారు. వీరబల్లి మామిడికి అంతర్జాతీయ మార్కెట్‌లో పెద్దఎత్తున డిమాండ్ ఉంది.

**అరటి సాగుచేయని ఊరు లేదు**

రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తారు. ఏడాది పొడవునా దిగుబడి వచ్చే ఈ పంట కారణంగా రూ.400 కోట్లకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ఎకరాకు రూ.4 లక్షలు తక్కువ లేకుండా ఆదాయం వస్తుండగా, ఖర్చులు పోను 3 లక్షలు రైతుకు మిగులుతోంది.

**భారీగా బొప్పాయి సాగు**

ఈ డివిజన్‌లో 25 వేల ఎకరాల్లో బొప్పాయి సాగవుతుండగా, రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. ఏడాదిలో 6 నెలలు ఈ వ్యాపారం సాగుతుంది. ఒక్కో ఎకరాకు సాగు ఖర్చులు పోను 3 లక్షల వరకు ఆదాయం వస్తుంది.

**ఏడాది పొడవునా.. నిమ్మ**

అనాదిగా ఈ ప్రాంతాల్లో ప్రధాన ఆదాయ వనరు నిమ్మ పంట. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పెరగడం, ధర తగ్గిపోవడంతో, క్రమేణా ఈ పంట సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుతం 5 వేల ఎకరాల్లో సాగయ్యే ఈ పంట వల్ల రమారమి 10 కోట్ల ఆదాయం వస్తుంది.

**కోల్డ్ స్టోరేజీలు లేక..**

రెండు నియోజకవర్గాల్లో ఉద్యాన పంటల ద్వారా వెయ్యి కోట్ల వ్యాపారం జరుగుతోంది. అయితే సీజన్‌లో ఒక్కసారిగా దిగుబడులు అధికంగా రావడంతో డిమాండు తగ్గిపోయి ధర పడిపోతోంది. నిలువ చేసుకునే అవకాశం లేకపోవడంతో నష్టం వస్తున్నా సరే తప్పనిసరై అమ్ముకోవాల్సి వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో పంట దిగుబడులను నిలువ చేసుకుని డిమాండ్ పెరిగిన తర్వాత విక్రయిస్తే మరింత అధికంగా ఆదాయం వచ్చేందుకు అవకాశం ఉంది. అందుకోసం కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయం గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు రైతులు విజ్ఞప్తి చేయడంతో ఆ మేరకు వారు హామీ ఇచ్చారు.





నిలువ చేసే అవకాశం లేక పారవేసిన నిమ్మకాయలు

**శీతల గిడ్డంగులను ఏర్పాటు చేయాలి**



రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో శీతల గిడ్డంగులను ఏర్పా టు చేయాలి. ప్రజా ప్రతినిధులు వీటి ఏర్పాటుపై దృష్టి సారించాలి. ప్రతి మండల కేంద్రంలో ఒక్కో కోల్డ్ స్టోరేజి ఉంటే రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- గుడారు విష్ణు, రైతు, మిట్టమీదపల్లె, రాజంపేట మండలం.

**ప్రోత్సహించాలి**



ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేల కోట్ల రూపాయల ఆదాయం అందించే ఈ పంటలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. శీతల గిడ్డంగులను కచ్చితంగా ఏర్పాటు చేయాలి.

- టి.లక్ష్మీనారాయణ, రైతు, రాజంపేట

## వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు

● ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి

సిద్దవటం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిని దృష్టిలో పెట్టుకుని సిద్దవటం రేంజిలోని అటవీ పరిసర ప్రాంతాల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ వన్యప్రాణులు తాగునీటి కోసం గ్రామంలోకి రాకుండా సాసర్ పిట్‌లతో పాటు, పలు నీటి కుంటల్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని నింపామన్నారు. గ్రామంలోకి అడవి జంతువులు, వన్యప్రాణులు వస్తే ప్రజలు వాటికి ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వన్యప్రాణులకు ప్రాణహాని తలపెడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.



సాసర్‌పిట్‌లో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

## బృందావనాలుగా.. చెత్త కేంద్రాలు : డీఎల్‌పీవో

పెద్దతిప్పసముద్రం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వం నిర్మించిన చెత్త కేంద్రాలను (డంపింగ్ యార్డు) సంపదను సృష్టించే బృందావనాలుగా తీర్చిదిద్దుతామని డీఎల్‌పీఓ నాగరాజు వెల్లడించారు. మంగళవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ముందుగా పెద్దతిప్పసముద్రం సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న డంపింగ్ యార్డులను మార్చి నెలాఖరులోగా సరికొత్త హంగులతో బృందావనాలుగా తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కందుకూరు, మద్దయ్యగారిపల్లె, గ్రామాల్లోని డంపింగ్ యార్డులను తనిఖీ చేశారు. కార్యాలయంలో ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మునిప్రతాప్‌తో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మునిప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు మనోహర్, విద్యావతి, కొండా శివప్రసాద్, ప్రమీలా, సురేఖ, నాగరాణి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

## గంజాయిని అరికట్టడంలో పోలీసులు విఫలం

కడప సెవెన్ రోడ్స్ మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): కడపలో గంజాయి వినియోగం, విక్రయాలను అరికట్టడంలో పోలీసుల విఫల మయ్యారని, వెంటనే గంజాయి అలర్ట్ ప్రకటించాలని జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి జి.మద్దిలేటిపై దాడి చేసిన అల్లరిమూకలను అరెస్టు చేయకపోతే ఆందోళన చేస్తామన్నా రు. కాగా మంగళవారం స్థానిక రిమ్స్‌లో చికిత్స పొందుతున్న మద్దిలేటిని పరామర్శించి గాలి చంద్ర హెచ్చరించారు. కాగా సోమవారం స్థానిక సాక్షి కార్యాలయం తన తమ్ముడు మల్లికార్జునతో కొంతమంది అల్లరిమూకలు గొడవపడుతున్నారని పోయిన మద్దిలేటిపై గంజాయి తాగిన మత్తులో దాడి చేసి గాయపరిచన్నారు. 24 గంటలు అవుతున్నా ఇంతవరకు అరెస్టు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ బాదుల్లా పాల్గొన్నారు.



మద్దిలేటిని పరామర్శిస్తున్న జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర

## ఇరువర్గాల ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరు గాయపడినట్లు వన్‌టౌన్ సీఐ ఎరీషావలి తెలిపారు. ఆయన కథనం మేరకు స్థానిక నీరుగట్టువారిపల్లెలో స్థలం విషయంలో బొమ్మిశెట్టి వెంకటేశ్(50),బొమ్మిశెట్టి రమణమ్మ (70), అదే గ్రామానికి చెందిన కప్పల చంద్ర కుటుంబసభ్యులు గొడవపడ్డారు. ఈ సందర్భంగా కప్పల చంద్ర కుటుంబ సభ్యులతో పాటు వారి మిత్రులు నలుగురు తమపై దాడి చేసి గాయపరిచారని వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. క్షతగాత్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నిమ్మనపల్లె కస్బాకు చెందిన మమత మంగళవారం పురుగుమందు తాగి ఆత్మ హత్యాయత్నం చేసింది, ఆకస్మారక స్థితిలో పడిఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

కలకడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎనుగొండపాలెం పంచాయితీ మొర్రంమీదపల్లెకు చెందిన యువకుడు మంజునాథ్(24) అదృశ్యం కావడంతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

## నాటుసారా తరలిస్తున్న ఒకరి అరెస్ట్

రాయచోటిటౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జోగేంద్ర తెలిపారు. మంగళవారం ఆ యన స్థానిక ప్రొహిబిషన్ అం డ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. సంబేపల్లె మండలం శెట్టిపల్లి పెద్దబిడికి సమీపంలో అటవీ ప్రాంతంలో మంగళవారం దాడులు నిర్వహించి ఆదిరెడ్డినాయక్ అనే వ్యక్తిని అరెస్టు చేసి, 30 లీటర్ల నాటుసారాను, ఒక మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 60 లీటర్ల నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలియజేశారు. నిబంధనలను ఉల్లఘించి ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ శశిధర్, సిబ్బంది వేమారెడ్డి, మోహన్‌రెడ్డి, హుస్సేన్, బాలకృష్ణ, జానీఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నట్లు తెలియజేశారు.



నాటుసారా, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

## ఉపాధి హామీ కూలీ మృతి

ఓబులవారిపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్కావారిపల్లె గ్రామ పంచాయతికి సంబంధించిన ఉపాధి హామీ కూలీ ఎర్రతోటి ఎల్లమ్మ(80) పనికి వెళ్లి తిరిగి వస్తూ గుండెపోటుకు గురై మరణించిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి మలరెడ్డి తెలిపారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీ, ఏపీవోలు పరామర్శించారు.

## దౌర్జన్యంగా ముగ్గురాయి మైనింగ్

లింగాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూమిలో దౌర్జన్యంగా ముగ్గురాయిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఇప్పట్ల గ్రామానికి చెందిన టి.విజయమోహన్‌రెడ్డి తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎస్‌ఐ మధుసూదన్‌రావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో విజయమోహన్‌రెడ్డికి సర్వేనెంబర్ 434, 435లో 7.7ఎకరాల్లో మైనింగ్ లీజు ఉంది. ఆ భూమిలో పి.ఓబుళరెడ్డి, మనోహర్‌రెడ్డిలు దౌర్జన్యంగా మైనింగ్ చేసి ముగ్గురాయి వెలికితీసేందుకు క్రేన్ బిగించి ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. విచారణ చేయమని రెవిన్యూ వారి దృష్టికి తీసుకెళ్లానని ఎస్‌ఐ తెలిపారు.

## ఉద్యోగాల పేరిట ఘరానా మోసం

- రూ.17 లక్షలు టోకరా
- సుండుపల్లెలో కేసు నమోదు
- మోసపోకండి: ఎస్‌ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, మార్చి11: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులను మోసగించిన ఉదంతం మండలంలోని పొలిమేరపల్లె గ్రామ పంచాయతీకి చెందిన అయ్యప్పరెడ్డి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. హైదరాబాదుకు చెందిన సాయితేజ, గుంటూరుకు చెందిన, జాషువా, నవ్య ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి పొలిమేరపల్లెకు చెందిన ఐదుగురి దగ్గర రూ.17 లక్షలు తీసుకొని మోసం చేశారని ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు.

రోజులు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోగా రూ.7 లక్షల రూపాయలు వెనక్కి ఇచ్చి మిగిలింది ఇవ్వకుండా చేతులెత్తేశారని ఫిర్యాదు దారుడు ఆవేదన వ్యక్తం చేశారు. వినాయకనగర్, మడితాడు, కుంటలముందరకు చెందిన పలువురు యువకులు కూడా వీరి చేతిలో మోసపోయినట్లు సమాచారం.

**ఉద్యోగం ఇప్పిస్తామంటే నమ్మకండి**

డబ్బులిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరు చెప్పినా నమ్మకండి అని ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. నిరుద్యోగ యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సంపాదించాలన్నారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ఫోన్లు చేస్తే, తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## టీడీపీ నేత కారుకు నిప్పు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంటి బయట నిలిపి ఉం చిన తన కారుకు మంగళవారం తెల్లవారుజామున దుండగులు నిప్పు పెట్టినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ వి లేకరులకు తెలిపారు. వేకువజామున పేలుడు శబ్దం వినిపించ డంతో బయటికి వచ్చి చూడగా, టయోటా ఇన్నోవా కారు మంటల్లో కాలిపోతూ కనిపించిందని , టైర్లు కాలి పేలినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో మదనపల్లె సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. విషయం తెలుసుకున్న మదనపల్లె ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్ పరామర్శించారు. ఈ దుశ్చర్యకు నిరసనగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, మదనపల్లె నేత తులసిరెడ్డి, కిశోర్‌కుమార్‌గౌడ్ మండల కేంద్రంలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. విజయకుమార్‌గౌడ్ తమ్ముళ్లకు, టీడీపీలోని ఓ సామాజిక వర్గ నేతల నడుమ భూతగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కారు దగ్ధం కావడంతో ఉత్కంఠ నెలకొంది



కారు దగ్ధంపై వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుమారుడు జునాయిద్

## కనకరుద్రాణి తిరునాళ్లకు ఘనంగా ఏర్పాట్లు

●నేటి రాత్రి పీవీజీపల్లెలో విడిది

పుల్లంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పీవీజీపల్లె, రామసముద్రం పంచాయతీల సరిహద్దులో దేవరకొండ గుట్ట వద్ద వెలసిన కనకరుద్రమ్మ తిరుణాలను ఈనెల 13న అత్యం త వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ మండపాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయం చుట్టూ చలువపందిళ్లు వేసి రంగు రంగుల విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. చతుర్దశినాడు కనకరుద్రమ్మ ఊటుకూరు శివాలయం నుంచి బయలుదేరి పల్లె గ్రామంలో రాత్రికి విడిది చేస్తారు. అక్కడ మహిళలు ఉపవాసంతో అమ్మవారికి ఎదుర్కోలు నిర్వహించి దీక్ష పూర్తి చేస్తారు. మరుసటిరోజు తెల్లవారుజామునే కనకరుద్రమ్మ దేవరకొండ గుట్ట వద్ద ఉన్న ఆలయానికి చేరుకుంటారు. అర్చకులు ఆమెకు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో ఆశీనురాలిని చేస్తారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.



కనకరుద్రమ్మ అమ్మవారు

## చేతులెలా వచ్చాయమ్మా..!

●అప్పుడే పుట్టిన ఆడబిడ్డను..గుట్టలో వదిలి వెళ్లిన తల్లి

ములకలచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆ తల్లికి చేతులేలా వచ్చాయో...అప్పుడే పుట్టిన ఆడబిడ్డను బ్యాగులో ఉంచి గుట్టలో వదిలేసి వెళ్లింది. వివరాల్లోకి వెళితే...ములకలచెరువులోని ఉమాశంకర్ కాలనీ సమీపంలో ఉన్న గుట్టలో సోమవారం ఉదయం అప్పుడే పుట్టిన ఆడబిడ్డను ఓ బ్యాగులో ఉంచి తల మాత్రం కనిపించేలా వదిలేసి వెళ్లారు. అటుగా వెళ్ళిన కాలనీకి చెందిన సుమియా అనే మహిళ చిన్నారి ఏడ్పు విని ముందుకెళ్లి చూడగా బ్యాగులో ఆడబిడ్డ కన్పించింది. దీంతో పాపను ఇంటికి తీసుకొచ్చి స్నానం చేయించి, దుస్తులు వేశారు. విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. .



గుట్టలో దొరికిన చిన్నారి

## రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం రైల్వే స్టేసన్ సమీపంలో మంగళవారం సాయంత్రం రైలు పట్టాలపై ఓ యువకుడి మృతదేహం లభ్యమైనట్లు కదిరి రైల్వే ఎస్‌ఐ రహీం తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు 20 నుంచి 23 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని యువకుడు నరసాపురం వెళ్లే రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

## చోరీ కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు పడి నగలు అపహరించుకుని వెళ్లినట్లు తాలూకా సీఐ కళా వెంకటరహన తెలిపారు. మదనపల్లె పట్టణం, దేవతానగర్‌కు చెందిన చిన్నరెడ్డెప్ప అరుణ దంపతులు ఈ నెల 9 న ఇంటికి తాళం వేసి అరిగివారిపల్లెకు వెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి వచ్చిన వారికి తలుపులకు వేసిన తాళంతోపాటు, బీరువా పగులగొట్టి ఉండడం కనిపించింది. దీంతో తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. 74 గ్రాముల బంగారు నగలను తస్కరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఒక గది.. నలుగురు సిబ్బంది!

- జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో సిబ్బంది కొరత
- పోస్టులు భర్తీ చేయలేదంటున్న అధికారులు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బందే దిక్కు.



మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న క్యాబిన్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాలు ఏర్పాటు చేసి దాదాపు మూడేళ్లు కావస్తున్నా మార్కెటింగ్ శాఖనుసిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. హడావుడిగా జిల్లాలను విభజించిన గత ప్రభుత్వం, అందుకు అనుగుణంగా పోస్టులు భర్తీ చేయకుండా నిర్లక్ష్యం వహించిందనేందుకు మార్కెటింగ్ శాఖ జిల్లా కార్యాలయం సాక్ష్యంగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన మార్కెట్ యార్డులో చెత్తాచెదారం, కంపచెట్ల నడుమ, పశువుల షెడ్డుకు సమీపంలోని ఒక గదిలో మార్కెటింగ్ శాఖ కార్యాలయం ఉంది. ఇన్‌చార్జి ఏడీ, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. మార్కెటింగ్ శాఖకు అవసరమైన కనీస వసతులు కూడా ఇక్కడ కనిపించడం లేదన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

**పోస్టుల భర్తీ ఏదీ?**

కొత్త జిల్లాల్లో పోస్టులు భర్తీ చేయడం లేదు. ఉన్న వారితోనే ఎలాగో కాలం నెట్టుకొస్తున్నాము. మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రమే.. ప్రస్తుత ప్రభుత్వమైనా పోస్టులు భర్తీ చేస్తే బాగుంటుంది.

- త్యాగరాజు, ఇన్‌చార్జి ఏడీ, మార్కెటింగ్‌శాఖ

**పరిపాలన కష్టమవుతోంది**

కూటమి ప్రభుత్వం కొత్త జిల్లాలపై శ్రద్ధ చూపకపోవడం దురదృష్టకరం. కొన్ని ఆఫీసుల్లో ఉద్యోగులకు భోజనం, తాగునీటి సౌకర్యం కూడా లేదని తెలిసింది. ఇప్పటికైనా సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది.

- వంగిమళ్ల రంగారెడ్డి, రైతు సంఘం నేత


## పోలీస్‌స్టేషన్ చేరిన 'పది' ప్రశ్న పత్రాలు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు రూట్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు ఆంజనేయులు, నారాయణ తెలిపారు. మంగళవారం సెట్-2 ప్రశ్న పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ జి.రవికుమార్, కానిస్టేబుల్ సమక్షంలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చిట్టిబాబు, నారాయణ, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## యువతను మోసగించడంలో దొందూ..దొందే

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యువతను, విద్యార్థులను నమ్మించి మోసం చేయడంలో టీడీపీ, వైసీపీలు దొందూ దొందే ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వైసీపీ ప్రత్యేక హోదా సాధించకుండా ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ వంటివాటిని విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అయిన డీఎస్సీ లేదు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు వేలకోట్లు బకాయిలు ఉన్నాయి, వైద్య విద్యను ప్రైవేటు పరం చేయాలనుకోవడం యువతను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

## వైభవంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉదయగిరి ఎల్లమ్మ

రాజంపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మన్నూరులో ఉన్న ఉదయగిరి ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఎల్లమ్మను దర్శించుకునేందుకు పట్టణం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఉదయం మహిళలు గుడి వద్ద పొంగుబాళ్లు సమర్పించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ సాయిస్వామి,ప్రధాన అర్చకులు నాగేంద్రశర్మ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హాజరయ్యారు.

# మోసగాళ్లొస్తున్నారు.. తస్మాత్ జాగ్రత్త

- పేద, మధ్య తరగతి వర్గాలే టార్గెట్
- నష్టపోతున్న గ్రామీణులు
- బయటకు చెప్పుకోలేకపోతున్న వైనం



**మోసపోయే వాళ్లున్నంత వరకు మోసం చేసే వాళ్లు ఉంటారనేది జగమెరిగిన సత్యం. మారుతున్న కాలానికి అనుగుణంగా మోసాలు కూడా కొత్త రూపం సంతరించుకుంటున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్నారు. నష్టపోయిన బాధితులు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతున్నారు.**

పెండ్లిమర్రి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమండలం గ్రామంలో ఇటీవల పలువురు ఇలా మోసపోయారు. వారం రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులు నందిమండలం గ్రామానికి వచ్చారు. తాము బజాజ్ ఫైనాన్స్ నుంచి వచ్చామని, ఎలాంటి ష్యూరిటీలు లేకుండా ఒక్కొక్కరికి రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు రుణం ఇస్తామని చెప్పారు. రుణం కావలసినవారు రూ.2800 కడితే రూ.50వేలు, రూ.5600 కడితే లక్ష రూపాయలు ఇస్తామని వివరించారు. ఈ మొత్తాన్ని వడ్డీ లేకుండా ప్రతి నెల కంతుల రూపంలో చెల్లించవచ్చని నమ్మించారు. దీంతో సుమారు 200 మందికి పైగా ఫోన్‌పే ద్వారా వారి ఖాతాకు డబ్బు చెల్లించారు. అనంతరం ఏమైనా వివరాలు కావాలంటే సంప్రదించాలని చెప్పి ఓ ఫోన్ నెంబరు కూడా ఇచ్చి వారు వెళ్లిపోయారు. మరుసటి రోజు డబ్బు కట్టించుకున్న ఫోన్‌పే నెంబరుతోపాటు, ఆగంతు కులు ఇచ్చిన ఫోన్ నెంబరు కూడా పని చేయకపోవడంతో తాము మోసపోయినట్లు బాధితులు గుర్తించారు.

మరో కేసులో.. గ్రామానికి వచ్చిన ఓ వ్యక్తి సచివాలయం సమీపంలో లక్ష్మీదేవి అనే మహిళను పలుకరించాడు. కేంద్ర ప్రభుత్వం మీ బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేసిందని, దాన్ని డ్రా చేయించి ఇస్తానని నమ్మించాడు. ఆమె మెడలో ఉన్న ఐదు తులాల బంగారు గొలుసును చూస్తే ధనవంతులు అనుకుంటారని, నగదు జమ చేసేదాకా దానిని పక్కన తీసి పెట్టండని చెప్పాడు. దీంతో ఆమె గొలుసు తీసి అతనికి ఇవ్వడంతో ఆమె కన్నుగప్పి పారిపోయాడు. ఈ విషయంపై అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు దాన్ని రికవరీ చేసి ఇచ్చారు.



**చెప్పుకుంటే అవమానమని..**

ఐటీఐ చదువుకున్న నేనూ బాధితుడినే.. మోసగాళ్ల చెప్పే మాటలు వింటే ఎవరైనా నమ్మేస్తారు. వ్యాపారం పెంచుకుందా మనే ఉద్దేశ్యంతో డబ్బు చెల్లించా. బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నాం.

*- గంగాధర్ రెడ్డి. చిల్లర దుకాణం..*



**ఫోన్‌పే ద్వారా చెల్లించాం..**

పోగొట్టుకున్నది చిన్న మొత్తం కావడంతో పోలీసులకు చెప్పలేక సందిగ్ధంలో పడ్డాం. డబ్బు లేకపోయిన ఇతరుల నుంచి ఫోన్‌పే చేయించుకుని వారికి చెల్లించాం. మాలాగా ఎవరూ మోస పోకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

*- దాసరి బ్రహ్మయ్య, చిరు వ్యాపారి*

## కస్తూర్బాగాంధీ పాఠశాలను తనిఖీ చేసిన జేసీ

వల్లూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వల్లూరు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను జాయింట్ కలెక్టరు అదితిసింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం స్థానిక ప్రత్యేక అధికారిణితో సమావేశమయ్యారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలికల కోసం శ్రద్ధ వహించాలని.. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. బాలికలకు కాస్మోటిక్స్, ఇతరత్రా వస్తువులు నెలనెలా సక్రమంగా అందుతున్నాయా అని అడిగారు. అలాగే మధ్యాహ్నం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఆర్డీవో జాన్ ఎర్విన్, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



భూమి రికార్డులను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

**వివాదాస్పద భూమిని పరిశీలించిన జేసీ**

సీకేదిన్నె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గలపల్లె పంచాయతీలోని వివాదాస్పద భూమిని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ మంగళవారం పరిశీలించారు. పోలిరెడ్డి లేపాక్షిరెడ్డి సోమవారం గ్రీవెన్‌సెల్‌లో ఫిర్యాదు చేయడంతో పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిసింది. ఆర్‌హెచ్ ప్రకారం అనుభవంలో తమ పేరుతో ఉండే భూమి ఆన్‌లైన్‌లో మరొకరి పేరు ఎక్కడంతో వారు తన 5.20 ఎకరాల భూమిని ఎకరా రూ.60లక్షలతో అమ్ముకున్నారు. ఆ విషయం తెలిసి బాధితుడు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించి న్యాయం చేస్తానని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి



మియాపూర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందాడు. హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. కడప ప్రాంతానికి చెందిన జహర్‌బాను, అమర్‌బాష చిన్న కుమారుడు రోషన్ (27) మూడు సంవత్సరాలుగా చందానగర్‌లో ఉంటూ హైటెక్‌సిటీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రోషన్ బయటకు వెళ్తున్నానని చెప్పి తన రూమ్ మేట్ భార్గవ్‌కు చెప్పి బుల్లెట్ వాహనంపై బయటకు వెళ్లాడు. చందానగర్ జాతీయ రహదారిపై మియాపూర్ వెళ్తుండగా దీప్తిశ్రీనగర్ వద్ద కమాన్ మలుపు వద్ద ముందువెళ్తున్న టిప్పర్‌ను ఓవర్ టెక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రోషన్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## మాలేపాడు సర్పంచి చెక్‌పవర్ రద్దు

ఎర్రగుంట్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలేపాడు గ్రామ సర్పంచి కుప్పన్నగారి శకుంతలమ్మ చెక్‌పవర్‌ను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి రద్దు చేశారు. గ్రామంలో ఆర్టీపీపీ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు నిర్వహణ కోసం ఆర్టీపీపీ నిధులు మంజూరు చేసింది. ఇందుకు సంబందించిన నిధులను గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా 2021 నుంచి 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.23,21,101 నిధులను డ్రా చేశారు. పంచాయతీ తీర్మానం లేకుండా నిధులు డ్రా చేసినట్లు విచారణలో తేలడంతో డీపీవో చెక్‌పవర్ రద్దు చేసినట్లు ఈవోపీఆర్‌డీ రంతుల్లయ్య తెలిపారు. ప్రస్తుతం రద్దు చేసిన చెక్‌పవర్‌ను ఈవోపీఆర్‌డీకి ఇచ్చారు.

## రూ.2 కోట్లతో ఉడాయించిన వ్యాపారి?

ఖాజీపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేటలో కిరాణాషాపు నిర్వహిస్తున్న శివనాగరాజు రూ.2 కోట్లతో ఉడాయించాడు. ఇతను మూడేళ్ల క్రితం అనంతపురం జిల్లా నుంచి వచ్చి కిరాణాషాపు నడుపుతూ ఉండేవాడు. మంగళవారం 'ఖాజీపేటలో పేలనున్న ఐపీ బాంబు' అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో రుణదాతలు షాపు వద్ద గుమికూడారు. నాగరాజు సమీప బంధువుతో దుకాణాన్ని తెరిపించారు. అందులో సరుకులు ఏమీ లేకపోవడంతో ఆశ్చర్యపడ్డారు. దుకాణం యజమాని పక్కా ప్రణాళికతో ఉడాయించినట్లు నిర్ధారించుకున్న రుణదాతలు కోర్టుకు వెళ్లనున్నట్లు తెలిపారు. నాగరాజుకు మాత్రం వ్యాపారంలో నష్టం రాలేదని, అంతా దోచుకుని దాచుకున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

## అనుమతిలేకుండా అబార్షన్లు, ఆపరేషన్లు... ఆసుపత్రి సీజ్





ఫ్లోరెన్సు ఆసుపత్రిని సీజ్ చేసిన వైద్య అధికారులు, బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం విజయనగరం వీధిలో వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా అబార్షన్లు, ఆపరేషన్లు చేస్తున్న ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రిని వైద్యఆరోగ్యశాఖ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. ఫ్లోరెన్సు ఆసుపత్రికి కేవలం ఒక జనరల్ ఫిజిషియన్ వైద్య సేవలు అందించేందుకు అనుమతి తీసుకొని ఏకంగా మహిళలకు సాధారణ కాన్పులు, సిజేరియన్ ఆపరేషన్లు, అబార్షన్‌లు చేస్తున్నారు. దీంతో ఈ ఆసుపత్రిని 2021లోనే సీజ్ చేశారు. మళ్లీ 2023 ఏప్రిల్ 12న పర్మిషన్ తీసుకున్నారు. అప్పుడు కూడా జనరల్ ఫిజిషియన్‌కు వైద్యశాఖ నుంచి 6 పడకలకు అనుమతులు తీసుకున్నారు. గైనకాలజిస్టు సేవలకు దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇవ్వలేదు. అయినా 2025 ఫిబ్రవరి నెలలో సిజేరియన్ ఆపరేషన్లు, సాధారణ కాన్పులు, అబార్షన్‌లు చేసినట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. ఆమేరకు మంగళవారం జిల్లా ఆర్‌బీఎస్‌కే పీవో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, డెమో భారతి, రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్లు మణికుమార్ వెంకటేశ్వర్లు లీగల్ సెల్ అథారిటీ పాలేశ్వరరావులు కలిసి ఫ్లోరెన్సు ఆసుపత్రిని సీజ్ చేశారు.

**ఆర్డీవో సాయిశ్రీ విచారణ :** ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రిలో భావన అనే గర్భిణి 2025 ఫిబ్రవరి 24న చేర్చుకొని అనధికారికంగా ఆమెకు వారాహి ఆసుపత్రిలో వున్న లోకేశ్వర్ అనే వైద్యుని పిలిపించి సాధారణ ప్రసవం చేశారు. పుట్టిన బిడ్డను తల్లి భావన అనుమతి లేకుండా వారాహి ఆసుపత్రికి తీసుకెళ్లి అనేక పరీక్షలు నిర్వహించారు. ఆ తరువాత శిశువులో ఎటువంటి వృద్ధి లేనందున 2025 మార్చి 3న తల్లిదండ్రులు కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ మూడు రోజుల వైద్యం అందించినా శిశువు మరణించినట్లు భావన ఆర్డీవో సాయిశ్రీకి తెలిపారు. ఈ మేరకు ఫ్లోరెన్సు నైటింగేల్ ఆసుపత్రి, వారాహి ఆసుపత్రిపై కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దారు గంగయ్య ఆర్ఐ నాగమోహన్‌రెడ్డిలు వున్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీలో అకౌంటెంట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), మార్చి11 (ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సొసైటీ కడప జిల్లా శాఖలో అకౌంటెంట్ల పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రటరీ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల వారు పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా నగరంలోని మట్టి పెద్దపులి వద్ద ఉన్న రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు.

పూర్తి వివరాలకు 08562272829, 9441513490 నెంబరును సంప్రదించాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి రూ.11,770 గౌరవ వేతనం ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఈ పోస్టుకు తగిన అభ్యర్థిని ఎంపిక చేస్తారని తెలిపారు. కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.



## పది పరీక్షల్లో విరామం... ఎంతో ఉపశమనం

కడప ఎడ్యుకేషన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశకు తొలి అడుగైన పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ సహజంగా వారిలో ఒత్తిడి పెరుగుతుంది. అధిక శాతం విద్యార్థులు పగలు, రాత్రి కష్టపడి చదవి పరీక్ష రోజున మర్చి పోతుంటారు. దీంతో ఆశించిన మార్కులు రాక నిరాశకు లోనవుతారు. గతంలో విద్యార్థులు పడిన ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు జర గనున్న పదో తరగతి పరీక్షల్లో ఒక రోజు విరా మం ఉండేలా విద్యాశాఖ ప్రణాళిక రూపొందించింది. దీని వల్ల ఒత్తిడి తగ్గి ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ విధానం అమలు చేయడం పట్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఈ అవకాశాన్ని వినియోగంచుకుంటాం...**



ఏడాదిలో పలు దఫాలుగా జరిగే సాధారణ పరీక్షల సమయంలోనే కనిపించని ఒత్తిడి ఉంటుంది. అలాంటిది పబ్లిక్ పరీక్షల్లో ఉండడం సహజం. దాన్ని అధిగమించేందుకు విద్యాశాఖ అందించిన విరామ సమయాన్ని అవకాశంగా మలుచుకుంటాం.

*-మానస, విద్యార్థిని.*

**ప్రతి నిమిషం ఎంతో ఉపయుక్తం**



పరీక్షల వేల గంట సమయం కూడా ఎంతో విలువైనది అని తొలి నుంచి ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాంటిది ఇపుడు ఏకంగా 24గంటల సమయం దొరుకుతోంది. ఇది మార్కుల సాధనకు ఎంతో దోహదపడుతుంది. తద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది.

*-హరిణి, విద్యార్థిని.*

**విద్యార్థులకు వరం**



రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు వరమనే చెప్పాలి. గతంలో ఎప్పుడు ఇలాంటి అవకాశం కల్పించలేదు. దీన్ని వినియోగించుకొని ఏడాది మొత్తం చదివిన వాటిని మరో మారు గుర్తు చేసుకోవాలి. పరీక్షలకు వెళ్లే ముందు భయాన్ని విడిచి నమ్మకంతో ఉండాలి.

*-మాబున్నీ, ఉపాధ్యాయులు, కడప.*

**పూర్తిస్థాయిలో దృష్టిసారిస్తారు**



ప్రభుత్వం విద్యార్థులకు గొప్ప అవకాశం కల్పించింది. ప్రస్తుతం వంద మార్కులకు ఒకే పేపర్ ఇస్తున్నారు. కీలకాంశాలు, సూత్రాలపై దృష్టిపెట్టి పరీక్షలు బాగా రాసే అవకాశం ఏర్పడు తుంది. దీంతో పూర్తిస్థాయిలో దృష్టిసారించాలి.

*-మేరీ, ప్రధానోపాధ్యాయని, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, చెమ్ముమియాపేట, కడప.*

## గ్లకోమాపై అవగాహన ర్యాలీ




కడపలో అవగాహన ర్యాలీ చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గ్లకోమా దినోత్సవం సందర్భంగా మంగళవారం కడపలో మహవీర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కడపలోని పుష్పగిరి విట్రియోరెటీనా ఇనిస్టిట్యూట్, డీబీసీఎస్ సమన్వయంతో గ్లకోమాపై ఏర్పాటు చేసిన ర్యాలీని డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి బాబు, డీపీఎం డాక్టర్ సునీత జెండా ఊపిప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వల్ల నిశ్శబ్ద కిల్లర్ గ్లోకోమాను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ దినేష్ గ్లోకోమా శస్త్రచికిత్సలపై మాట్లాడారు. ర్యాలీ సందర్భంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు గ్లోకోమాపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు.

## 17 టీఎంసీల నీటి నిల్వకు సహకరించండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్‌లో 17 టీఎంసీల నీరు నిల్వ చేసేందుకు సహకరించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడారు. బ్రహ్మంసాగర్‌ను నిండుగా నింపేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబునాయుడు, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడులను కోరారు. బ్రహ్మంసాగర్ నిర్మించినప్పటి నుంచి ఒక్క సారి కూడా పూర్తిగా నీటితో నింపలేదని, పూర్తిగా నింపేం దుకు గతంలో కుందూనది నుంచి లిఫ్ట్ ఇరి గేషన్ ద్వారా రూ.528 కోట్ల టెండర్లు పిలవడం జరిగిందని, కానీ పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదన్నారు. బ్రహ్మంసాగర్‌ను నీటితో నిండుగా నింపగలిగితే బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలు పాడి పంటలతో సస్యశ్యా మలం అవుతాయని తెలిపారు. వెంటనే లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభించాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు బ్రహ్మంగారిమఠంలో డీకేటి భూములను అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకు న్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ ద్వారా కమిటీని వేయించి విచారణ జరిపించాలని స్పీకర్‌ను కోరారు.

## రబీ పంటలకు బీమా ఇవ్వని వైసీపీ

- తీవ్రంగా నష్టపోయిన రైతులు
- శాసనమండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ

వేంపల్లె, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో 2019 నుంచి 2024 వరకు నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ ఇచ్చిన దాఖలాలు లేవని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్సూరెన్స్ ఇచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని మండలిలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో రైతులు ఎదుర్కొంటున్న ప్రధాని ఇన్సూరెన్స్ సమస్య గురించి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రైతుల ఇన్సూరెన్స్‌ను చెల్లిస్తామని చెప్పి పట్టించుకోకపోవడంతో రైతులకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ప్రీమియం సక్రమంగా కట్టకపోవడం వల్ల నష్టపోయిన రైతులకు క్లెయిములు రాలేదన్నారు. జమ్మలమడుగు, పులివెందుల ప్రాంతంలో బుడ్డశనగ వేస్తారు, ఆ రైతులకు కూడా నష్టపోయిన సమయంలో ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ రాలేదని తెలిపారు. నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బుగ్గ వంక ప్రాజెక్టు పనుల పరిశీలన

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బుగ్గవంక ప్రాజెక్టు పనులను జయకా ఇంజనీరింగ్ వర్క్స్ కన్సల్టెంట్, రిటైర్డ్ సీఈ సబ్‌జాన్‌బాష మంగళవారం పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రాజెక్టు పనులను మరో ఐదేళ్ల పాటు పొడిగించాలని ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుల్ షమీతో కలిసి సమీక్ష నిర్వహించారు. జయకా నిధులతో చెరువులు అభివృద్ధి చేసుకోవచ్చు. వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కూడా ప్రయోజనం కలుగుతుంది. ఇరిగేషన్ రెగ్యులర్ ఈఈ వెంకటరామయ్య, వెలిల్లు ఈఈ శ్రీనివాసులరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ మునీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు గాయాలు

జమ్మలమడుగు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం బస్టాపు వద్ద బొలెరో క్యాంపర్ వాహనం స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో రిటైర్డు టీచర్ నగళ్లపాటి సుబ్బరాయుడు (63) అక్కడిక్కడే మృతిచెందగా అతని భార్య క్రిష్ణవేణికి గాయాలయ్యాయి. మృతుడు మైలవరం మండలం వేపరాల గ్రామానికి చెందినవాడు. భార్యాభర్తలు మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో వేపరాల నుంచి బయల్దేరారు ధర్మాపురం గ్రామం వద్ద స్కూటీని నిలిపి నీళ్లు తాగుతుండగా ప్రొద్దుటూరు మండలం మత్స్యకాలనీకి చెందిన ఎస్‌వీ క్రిష్ణారెడ్డి బొలెరో వాహనంలో ప్రొద్దుటూరుకు వెళుతూ అదే సమయంలో స్కూటీలో ప్రొద్దుటూరుకు వెళుతున్నవారిని ఢీకొన్నాడు. ఘటనా స్థలంలో భర్త సుబ్బరాయుడు మృతిచెందగా భార్య కుడి చేతికి రక్తగాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# మసిపూసి మారేడు కాయచేసిన వైసీపీ

- పాపాఘ్నిపై వంతెన నిర్మాణం జరిగేనా?
- మూడేళ్లుగా శాశ్వత వంతెన కోసం ఎదురు చూపు
- నేతల హామీలు నీటిపై రాతలేనా.....
- వర్షాకాలం వచ్చిందంటే భయం భయంగా గడపాల్సిందేనా...
- తాత్కాలిక మరమ్మతులతోనే కాలయాపనలు...


చెన్నరాయునిపల్లె వద్ద పాపాఘ్ని నదిపై పూర్తిగా తెగిపోయిన కల్వర్టు (ఫైల్ ఫొటో)

పెద్దతిప్పసముద్రం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాపాఘ్ని నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపడతామని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలన్నీ నీటిపై రాతలుగానే మిగిలి పోతున్నాయి. వైసీపీ ప్రభుత్వం ప్రతి పనినీ మసిపూసి మారేడు కాయ చేస్తుందే తప్ప ప్రజల బాగోగులు చూసుకోలేదని విమర్శలున్నాయి. పాపాఘ్ని నదిపై వంతెన నిర్మాణం కోసం మూడేళ్లగా టి.సదుం, చెన్నరాయునిపల్లె, గుంటిపల్లె, రేకలగుంటిపల్లె, జంబుగానిపల్లె ప్రజలు ఎదురు చూస్తున్నారు. పాపాఘ్ని నదిపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపడతామని అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు నీటిపై రాతలుగానే మిగిలి పోతున్నాయి. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలకు ఈ గ్రామాల ప్రజలు వెళ్లాలంటే ఈ వంతెన ద్వారానే వెళ్లాలి. గతంలో భారీ వర్షాలకు వంతెన పూర్తిగా కొట్టుకుపోవడంతో ఇక్కడ హైలెవెల్ వంతెన నిర్మించాలని, ఇందుకు సుమారు రూ. 7కోట్లు ఖర్చవుతుందని, ఈ నిధులు కూడా మంజూరు చేస్తున్నట్లు వైసీపీ ప్రభుత్వం ప్రజలను నమ్మించింది. ప్రస్తుతానికి తాత్కాలికంగా వంతెనపై సిమెంట్ దిమ్మెలను అమర్చి దానిపై మట్టిని తోలి రాకపోకలు సాగించారు. మసిపూసి మారేడు కాయను చేసిన వైసీపీ ప్రభుత్వం ప్రజలను మాయ చేసిందని చెప్పవచ్చు. ప్రజలకు ఆ మాయ వీడేందుకు ఎక్కువ కాలం పట్టలేదని పిస్తోంది. వివరాల్లోకెళితే....

కర్ణాటక రాష్ట్రం, మండల సరిహద్దు సమీపంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె వద్ద చేలూరు - బి.కొత్తకోట మధ్య ప్రధాన రహదారి పాపాఘ్ని నదిపై ఉంది. ఇక్కడ వర్షాకాలం వచ్చిందంటే పిల్లలు, పెద్దలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండల ప్రజలు వెళ్లాలంటే ఈ వంతెన గుండానే వెళ్లాలి. గతంలో కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో ఈ గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మించాలని, ఇందుకు నిధులు మంజూరు చేసినట్లు వైసీపీ ప్రభుత్వం ప్రజలను నమ్మించింది. శాశ్వత వంతెన నిర్మాణానికి ఆలస్యం అవుతుందని ప్రస్తుతానికి తాత్కాలికంగా నిర్మిస్తామని లోకల్ నేతలతో వంతెనపైన సిమెంట్ దిమ్మెలను అమర్చి తాత్కాలికంగా మట్టిని తోలి రహదారిపై రాకపోకలు జరిగేలా చేయించారు. అయితే మళ్లీ ఏడాదికే భారీ వర్షాలు కురవడంతో తాత్కాలిక వంతెన కాస్తా పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రజాప్రతినిధులు మళ్లీ తాత్కాలికంగా చేపట్టారేతప్ప శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోలేదు.

## అధికారులకు విన్నవించినా....

ఈ వంతెన నిర్మాణంపై అధికారులకు మూడేళ్లగా విన్నవించుకుంటూనే ఉన్నా ప్రయోజనం లేదని టి.సదుం ప్రజలు వాపోతున్నారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి అధికారులు చేతులు దులుపుకొంటున్నారే తప్ప శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పాపాఘ్ని నదిపై ఉన్న ఈ వంతెన తెగిపోతే ఇటు బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రానికి, అటు కర్ణాటక రాష్ట్రం చేలూరుకు వెళ్లాలన్నా సుమారు 25 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి.

## బొంతవారిపల్లెకు తప్పని తిప్పలు

రంగసముద్రం గ్రామం బొంతవారిపల్లె సమీప వంతెన రంగసముద్రం పెద్దచెరువు మొరవ నీళ్లు వెళ్లే దారిలో ఉన్న వంతెన వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా తెగిపోయింది. దీంతో బొంతవారిపల్లె నెటవరాయునిపల్లె, మలిగివారిపల్లె గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రజలు శాశ్వత పరిష్కారం చేపట్టాలని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే నిర్మాణాలు చేపడతామని అధికారులు చెబుతున్నా ఆ సమస్య నేటికీ పరిష్కారం కాలేదు.

### కూటమి ప్రభుత్వమైనా...

వర్షాకాలం కురిసిందంటే పాపాఘ్ని నదిపై ఉన్న కల్వర్టుపై ప్రయాణించాలంటే భయం భయంగా గడపాల్సి వస్తోంది. అధికంగా వర్షాలు వచ్చాయంటే కల్వర్టు తెగిపోవడం ఖాయం. పాపాఘ్నిపై కల్వర్టు తెగిపోతే మండల కేంద్రానికి వెళ్లేందుకు సుమారు 35 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి ఉంటుంది. కనీసం ఈ కూటమి ప్రభుత్వంలోనైనా పాపాఘ్ని నదిపై శాశ్వతంగా కల్వర్టు నిర్మించి ప్రజలను ఆదుకోవాలని కోరుకుంటున్నాం

సి. ఆంజనేయులు చెన్నరాయునిపల్లె వాసి


బొంతవారిపల్లె వద్ద తాత్కాలిక మరమ్మతులు చేసినా తిరిగి తెగిపోయిన దృశ్యం

### నిధులు మంజూరయ్యాయి

పాపాఘ్ని నదిపై ఉన్న కల్వర్టు నిర్మాణానికి రూ. 7 కోట్లు నిధులైతే మంజూ రయ్యాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆ కల్వర్టు నిర్మా ణం చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేక పోయాం. ఈ ప్రభుత్వంలో కల్వర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. బొంతవారిపల్లె సమీపంలో ఉన్న కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిం చాం నిధులు మంజూరైతే పనులను పూర్తి చేస్తాం

శ్రీనివాసులు ఆర్అండ్‌బీ అధికారి

## వన్‌బీని రద్దు చేయాలని బాధితుల ఆందోళన


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న బాధితులు

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తయారు చేయించుకున్న వన్‌బీని రద్దు చేయాలని మంగళవారం నీరుగట్టువారిపల్లెకు చెందిన బాధితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేస్తూ బైఠాయించారు. రెండు గంటల సేపు తహసీల్దార్ కార్యాలయంలోకి ఎవరినీ వెళ్లకుండా అడ్డుకున్న వారు మాట్లాడుతూ బీకే పల్లె గ్రామం, గంగోత్రి కల్యాణమండపం సమీపంలో 20 ఏళ్ల కిందట 77 మంది ఓ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి పునాదులు నిర్మించుకున్నారన్నారు. ఇటీవల దేశిరెడ్డి హరినాధరెడ్డి పేరుతో జీపీ చేయించి ఆ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి వన్‌బీ చేసి మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మాలపాటి రమేష్ కొనుగోలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. కాగా సదరు భూమిలోకి రానివ్వకుండా పునాదులను చదును చేస్తూ దౌర్జన్యం చేస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు. వెంటనే వన్‌బీని రద్దు చేసి మాకు న్యాయం చేయాలని తహసీల్దార్ ధనంజయులును బాధితులు కోరారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయరాదని, కోర్టులో తేల్చుకోవాలని బాధితులను పోలీసులు పంపివేశారు. బాధితులు బాలకృష్ణ, సోమశేఖర్, సుబ్రమణ్యం, సురేంద్రనాయుడు, చంద్రశేఖర్, మాలినీ, హరికృష్ణ, వెంకటాద్రి, శంకర, మంజులా, స్వాతి, రామాంజనేయులు, నాగవేణి, మోహన్, పద్మభూషణ్, వేణుగోపాల్, రమణ, రమేష్, సహదేవ పాల్గొన్నారు.

## జనసేన మండల అధ్యక్షుడిగా రవీంద్ర



కలికిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన మండల అధ్యక్షుడిగా కుక్కామల్ల రవీంద్రను నియమిస్తూ ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు రవీంద్రను నియమించినట్లు తెలిపారు. కాగా గతంలో ఆ పార్టీ అధ్యక్షుడిగా వున్న అస్లామ్ కొన్ని వివాదాలకు కారకులవడంతో తొలగించి రవీంద్రను నియమించామన్నారు.



## గృహ లబ్ధిదారులకు అదనపు నిధులు

పెద్దతిప్పసముద్రం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాల లబ్ధిదారులకు అదనపు నిధులు మంజూరు చేసినట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు కూటమి ప్రభుత్వం అవకాశాన్ని కల్పించిందన్నారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేలు, ప్రభుత్వం ఆదనంగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## చలో విజయవాడను విజయవంతం చేయండి

ములకలచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నభోజన పథకం కార్మికుల వేతనాల పెంపు కోసం 19వతేదీన తలపెట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప పిలుపునిచ్చారు. ములకలచెరువులో మంగళవారం చలోవిజయవాడ కరపత్రాలను ఆవిష్కరించారు. నేతలు మంజుల, హసీనా, నసీబ్‌జాన్, హాజీరా, లక్ష్మీ, దేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎడిపై స్కూల్ నిర్వహణకు అనుమతులు లేవు : ఎంఈఓ

నిమ్మనపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): దిగువమాచిరెడ్డిగారిపల్లి వద్ద వెలసిన ఎడిపై స్కూల్ నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవని ఎంఈఓ-1 పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దిగువ మాచిరెడ్డిగారిపల్లిలో స్కూల్ స్థలాన్ని, ఏర్పాటు చేసిన బోర్డును పరిశీలించిన ఆమె మాట్లాడుతూ ఎడిపై స్కూల్ నిర్వహణకు విద్యాశాఖ నుంచి అనుమతులు మంజూరు కాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనుమతులు పొందకనే నర్సరీ నుంచి 5వతరగతి వరకు పాఠశాలను ప్రారంభిస్తున్నామని దీనికి 2025-26 అడ్మిషన్‌లు జరుగుతాయని ఫ్లెక్సీ వేయడం గమనార్హం.

## యువపోరు పేరుతో జగన్ దొంగాట

### తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): యువపోరు పేరుతో జగన్‌రెడ్డి దొంగాట ఆడుతున్నాడని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో యువత భవితను దెబ్బతీసి ఇప్పుడు డ్రామాలకు తెరలేపాడన్నారు. రాష్ట్రంలో రూ.4,271 కోట్లు ఫీజు, వసతి దీవెన బకాయిలు పెట్టి ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నాడన్నారు. 2014 - 19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే దాన్ని జగన్ 9 లక్షల మందికి కుదించి 7 లక్షల మంది విద్యార్థులకు అన్యాయం చేశారన్నారు. చంద్రబాబు 6 లక్షల మంతికి నిరుద్యోగ భృతి ఇస్తే దాన్ని జగన్ ప్రభుత్వం రద్దు చేసి యువతకు ద్రోహం చేసిందన్నారు. కమీషన్ల కోసం పరిశ్రమలపై జగన్ ప్రభుత్వం దాడులు చేసి పెట్టుబడుల్ని పొరుగు రాష్ట్రాలకు తరిమేసి నిరుద్యోగం పెంచారన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, కురబలకోట మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, మహిళా కార్యదర్శి గంగాదేవి, నేతలు సురేంద్రనాయుడు, విశ్వనాధరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గంజి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పీలేరు ఆస్పత్రిలో వైద్య సేవలు భేష్


ప్రథమ బహుమతి అందుకుంటున్న ప్రసూతి విభాగం స్టాఫ్ నర్స్ అమ్మాజీ

పీలేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వంద పడకల ఆస్పత్రిగా రూపాంతరం చెందిన పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో అన్ని సేవలు బాగున్నాయని రాయచోటి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు వెంకట శివ పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రిగా మారి ఏడాది పూర్తయిన సందర్భంగా రాయచోటి ఆస్పత్రి వైద్యులు మంగళవారం పీలేరు ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రిలోని వివిధ సేవలను ఏడు విభాగాలుగా విభజించి సిబ్బందికి మార్కులు ఇచ్చారు. ప్రసూతి విభాగం ప్రథమ స్థానం, లేబరేటరీ అండ్ ఎక్స్‌రే విభాగం ద్వితీయ స్థానం, పారిశుధ్య విభాగం తృతీయ స్థానం గెలుచుకున్నారు. సిబ్బందికి ఆస్పత్రి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతమ్మ బహుమతులు అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సిబ్బంది అమ్మాజీ, లావణ్య, జ్యోతి, రేష్మ, స్వామినాథన్, శ్రీనివాసులు, నసీబ్‌జాన్, నాగరాణి, పుష్పలత, మల్లికార్జున పాల్గొన్నారు.

## అధికారులు ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

నిమ్మనపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, టీడీపీ జిల్లా బీసీసెల్ కన్వీనర్ లక్ష్మన్న పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్‌యార్డులో జనసేన, టీడీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని తెలిపారు. కొందరు కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారుల మాటలను కూడా పెడచెవిన పెడుతున్నారని ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలన్నారు. జనసేన మండల అధ్యక్షుడు ప్రదీప్, రెడ్డెప్ప. వెంకటరమణ, భాస్కర్, షఫీ, నాగరాజు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాల పూర్తికి చేయూత

కలకడ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్ణంగా ఉన్న గృహనిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చేయూతనిస్తోందని హౌసింగ్ ఏఈ నాగముని నాయక్ తెలిపారు. 2019-24 మధ్య ఇళ్ల మంజూరై పనులు వివిధ దశల్లో ఉన్న నిర్మాణాల లబ్ధిదారులు ఏప్రిల్ చివరిలోగా పూర్తి చేయాలని కోరారు.

## 'నవోదయం'పై విస్తృత ప్రచారం

పీలేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవోదయం 2.0పై మంగళవారం పీలేరు ఎక్సైజ్ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రామానాయక్ తండా, ఆవులయ్యగారిపల్లె తండా, కేవీపల్లె మండలం దిగువ వగళ్ల తండాలో నాటు సారా తయారీ, విక్రయం పర్యవసానాలపై పీలేరు ఎక్సైజ్ సీఐ సీవీ సుబ్బారెడ్డి అవగాహన కల్పించారు. పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు, కేవీ పల్లె తహసీల్దారు నరేంద్ర కుమార్, పీలేరు ఎస్ఐ లోకేశ్, పాల్గొన్నారు.


రామానాయక్ తండాలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

## సంఘమిత్రను కొనసాగించాలంటూ ధర్నా



మహిళలతో కలిసి ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నేతలు

బి.కొత్తకోట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బడికాయలపల్లె పంచాయతీ 4వ వీఓ సంఘమిత్ర భారతిని కొనసాగించాలంటూ పలువురు మహిళాసంఘాల సభ్యురాళ్లు మంగళవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ నేతలు ధర్నాకు సంఘీభావం తెలిపింది. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ సంఘమిత్ర భారతి పేరును ఆన్‌లైన్ నుంచి తొలగించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 2011 నుంచి పనిచేస్తున్న భారతిని అన్యాయంగా తొలగించడంతో కోర్టును ఆశ్రయించిన ఆమెకు సానుకూల తీర్పు వచ్చినా అధికారులు పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారులు చొరవ చూపి వెంటనే భారతిని విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో గ్రూపుల మహిళలతో కలిసి ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. వినతిపత్రాన్ని ఏపీఎం రాజేశ్వరికి అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా నేతలు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి, బాలక్రిష్ణ, గఫూర్ పాల్గొన్నారు. ఏపీఎం మాట్లాడుతూ భారతిని గతేడాది జూలైలో అప్పటి అధికారులు తొలగించి మరొకరిని తీసుకున్నామన్నారు. ధర్నా వినతిపత్రాన్ని జిల్లా అధికారులకు పంపుతామన్నారు.

మాంసం మార్కెట్, జంతువధశాలకు వేలం

## మున్సిపాలిటీకి రూ.4.76లక్షలు ఆదాయం

### దినసరి, వారపు సంతలకు 15న వేలం

మదనపల్లె, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని వివిధ మార్కెట్లకు వేలం పాటలు నిర్వహించగా, మాంసం మార్కెట్, జంతువధశాలకే వ్యాపారులు ముందుకొచ్చారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల అధ్యక్షతన 2025-26 ఆర్థిక ఏడాదికి వేలం నిర్వహించగా, మాంసం, జంతువధశాల నుంచి మున్సిపాలిటీకి రూ.4.76లక్షలు ఆదాయం వచ్చింది. మిగిలిన వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేటు బస్టాండు, టౌన్‌హాలును ఏడాదిపాటు లీజుకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో కమిషనర్ వాటి బహిరంగ వేలాన్ని 15వతేదీ ఉదయం 11గంటలకు వాయిదా వేశారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులోని దిగువ, మొదటి అంతస్థులోని 52షాపు రూములను మూడేళ్ల కాలపరిమితితో నెలవారి అద్దెకు ఇచ్చేందుకు అదేరోజు సాయంత్రం 3గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

## వ్యాక్సినేషన్లతో పాల దిగుబడి తగ్గదు

- పశుసంవర్థక మదనపల్లె ఏడీఏ విశ్వేశ్వర్ రెడ్డి

కలికిరి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధికి అందిస్తున్న టీకాలతో పాడి ఆవుల్లో పాల దిగుబడి తగ్గదని మదనపల్లె పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తారన్నారు. ఈ టీకాల కారణంగా పాల దిగుబడి తగ్గుతుందన్నది కేవలం అపోహ మాత్రమేనని ఆయన వివరించారు. పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నిరోధక టీకాలను వేసుకోవాలని ఆయన కోరారు. పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. రోజూ పశుసంవర్థక శాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి టీకాలు వేస్తున్నట్లు కలికిరి ప్రాంతీయ పశు వైద్య కేంద్రం ఏడీ డాక్టర్ వెంకటముని నాయుడు చెప్పారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ గిరినాథ రెడ్డి, పశు వైద్య సిబ్బంది, సహాయకులు పాల్గొన్నారు.

## చిప్పిలిలో సహస్ర లింగార్చన


రుద్రాక్షలతో నిర్వహిస్తున్న సహస్ర లింగార్చన

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలో వెలిసిన సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సహస్ర లింగార్చన నిర్వహించారు. జగద్గురు పుష్పగిరి మహాసంస్థాన పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామి పాల్గొన్నారు. సాయంత్రం విద్యాశంకర భారతీ స్వామి ప్రవచనాలను బోధించారు. బుధవారం స్వామిచే సత్యదేవ సదన్ ప్రారంభిస్తారు. ఆలయకమిటీ అధ్యక్షుడు ఎ.అమరనాథ్, కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి దివాకర్, కో ఆర్డినేటర్ శివశంకర్, కుమారస్వామి పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డీఎం

మదనపల్లె అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక టు డిపోలో బుధవారం 11 గంటల నుంచి డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు అమరనాథ్ తెలిపారు. ప్రయాణీకులు తమ సమస్యలను తెలపడానికి, ఆర్టీసీ ఆదాయం పెంచడానికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రయాణీకులు ఈ నెంబరుకు 9959225677 ఫోన్ చేయాలని సూచించారు.

## ఘనంగా సొప్పలమ్మతల్లి గంగజాతర


ప్రత్యేక అలంకరణలో సొప్పలమ్మతల్లి

నిమ్మనపల్లి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపల్లిలో వెలసిన సొప్పలమ్మతల్లి ఆలయంలో గంగజాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జామున అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి పొట్టేళ్లను సమర్పించినట్లు ఆలయ ధర్మకర్త రెడ్డెప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో వున్న ఆలయం స్థానంలో కొత్త ఆలయాన్ని నిర్మించి సొప్పలమ్మ గంగజాతరను నిర్వహించామని తెలిపారు. అనంతరం ఆలయాన్ని వచ్చిన భక్తులకు అన్నదానం చేపట్టారు.

## సింహవాహనంపై ఊరేగిన గట్టు వేంకటేశ్వరస్వామి


సింహవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

రామసముద్రం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చెంబకూరు మేజర్ పంచాయతీలోని గట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి స్వామి వారిని సింహవాహనంపై ఊరేగించారు. మేళతాళాలు, బాణసంచా, చెక్కభజనలు, కోలాటాలతో ఘనంగా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 'చలో పిఠాపురం' విజయవంతం చేయాలి

పీలేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న పిఠాపురంలో జరుగనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి కలప రవి జనసైనికులను కోరారు. పీలేరులో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆవిర్భావ సభకు ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాల నుంచి జనసైనికులు, పవన్ కల్యాణ్ అభిమానులు, సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

## కోర్టు తీర్పులతోనైనా కనువిప్పు కలగాలి

పీలేరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కోర్టు తీర్పులతోనైనా కుల దురహంకారులకు కనువిప్పు కలగాలని మాలమహానాడు మండల యూత్ అధ్యక్షుడు జెట్టి దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ప్రణయ్ హత్య కేసు తీర్పు నేపథ్యంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కేవలం దళితుడన్న కారణంతో ప్రణయ్‌ను దారుణంగా హత్య చేశారని, హత్యకు పన్నాగం పన్నిన మారుతీరావు ఆత్మహత్య చేసుకోగా హత్య చేసిన వారికి కోర్టు కఠిన శిక్ష విధించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. ప్రణయ్ కుటుంబసభ్యులకు అండగా నిలిచిన న్యాయవాదులు, పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు తుమ్మల రవిచంద్ర, గణేశ్, వినయ్ కుమార్, మనోజ్, కార్తీక్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.